నేటి కందం- నేటికి అందం

కాపాడగ రాజ్యాంగము
చూపగ తెలంగాణమునకు సొబగుల దారిన్
దీపించు గవర్నరుగా
చేపట్టెను బాధ్యతలను శివ పీ శుక్లా !!

(తెలంగాణా రాష్ట్ర నూతన గవర్నర్ గా శ్రీ శివ ప్రతాప్ శుక్లా ప్రమాణం స్వీకారం చేశారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

ప్రభుత్వం తలచుకుంటే
పార్టీ మారి వచ్చినోళ్లు
ఏ వేటు పడకుండనే
ఎగురుతారు ఐదేళ్లు.
నిన్న నేడు ఎప్పుడైనా
నడుస్తున్న చరిత అదే
నిజాలన్ని అబద్ధంగా
నీతిదప్పి మార్చుడిదే.

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ శుక్రవారం 13-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:171 పేజీలు:6 వెల: రూ.1/-


## దుబాయ్, సౌదీ, ఖతార్‌లపై ఇరాన్ దాడులు..

# ఇప్పటివరకు 24 మంది మృతి



న్యూఢిల్లీ, మార్చి 12:మార్చి 12: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తుంటే ఇరాన్ మాత్రం గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. దుబాయ్, సౌదీ, ఖతార్ సహా యూఏఈ దేశాలపై దుబాయ్ దాడులు చేస్తోంది. ముఖ్యంగా అక్కడి అమెరికన్ ఆర్మీ బేస్‌లపై ఇరాన్ దాడులకు దిగుతోంది. తాజాగా గురువారం కూడా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. దుబాయ్‌లోని డౌన్ టౌన్ సిటీపై డ్రోన్ దాడి జరిగినట్లు, దీనివల్ల స్వల్పంగా నష్టం కలిగినట్లు దుబాయ్ అధికారులు తెలిపారు.

అయితే, ఈ దాడి ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని కలగలేదని, స్వల్ప గాయాలు తగిలాయని తెలిపింది. మిడిల్ ఈస్ట్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ దాడిలో ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో 24 మంది మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరణించిన వారిలో అమెరికాకు చెందిన వారు ఏడుగురు ఉన్నారు. గురువారం ఉదయం దుబాయ్ తీరంలోని పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఒక కంటైనర్ షిప్‌పై దాడి జరిగింది. ఈ దాడిలో నౌకా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని బ్రిటీష్ మిలిటరీ అధికారులు తెలిపారు. బహ్రెయిన్‌లోని ముహర్రక్ ఐలాండ్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. ఈ ఘటనలో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది.

కువైట్‌లోని ఒక నివాస భవనంపై ఇరాన్ జరిపిన దాడిలో ఇద్దరు గాయపడ్డట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్ ప్రయోగించిన ఒక డ్రోన్‌ను రియాద్ సమీపంలో నేలకూల్చినట్లు సౌదీ అరేబియా తెలిపింది. ఇప్పటివరకు ఇరాన్ యుద్ధం కారణంగా జరిగిన దాడుల్లో మొత్తం 19 వాణిజ్య నౌకలపై దాడి జరిగింది. ఇంకోవైపున ఇరాన్‌తోపాటు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది.

## భారత్‌లో ఇంధన కొరత లేదు.. లోక్‌సభలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్



న్యూఢిల్లీ, మార్చి 12:ఇండియాలో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొనడంతో కేంద్ర మంత్రి లోక్‌సభలో మాట్లాడారు.

'ఆధునిక ఇంధన చరిత్రలో ప్రపంచం ఇలాంటి క్లిష్ట సమయాన్ని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సురక్షితమైన సరఫరాలను సమకూర్చుకుంది. హార్మూజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హార్మూజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధాన మంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి' అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కొనేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు.

### ఎల్ఎన్‌జీ కార్గోలు ప్రతిరోజూ వస్తున్నాయి

డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎల్ఎన్‌జీ కార్గోలు దాదాపు ప్రతిరోజూ ప్రత్యామ్నాయ సరఫరా రూట్లలో ఇండియాకు వస్తున్నాయని తెలిపారు. ఒకవేళ ఘర్షణలు సుదీర్ఘకాలం కొనసాగినప్పటికీ తగినంత గ్యాస్ ఉత్పత్తి, సరఫరా ఏర్పాట్లు చేయగలిగే స్థితిలో ఇండియా ఉందని అన్నారు. గృహాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు.

### ఎల్పీజీ ఉత్పత్తి 28 శాతం పెరిగింది

రిఫైనరీలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా గత ఐదు రోజులుగా 28 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెరిగినట్టు హర్దీప్ సింగ్ పురి తెలిపారు. లక్షలాది భారతీయ కుటుంబాల వంటిళ్లలో ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, డొమెస్టిక్ సప్లయ్‌కు పూర్తి భరోసా ఉందని చెప్పారు.

## పర్యావరణ పరిశుభ్రతలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

### -ఎంజీయూ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణప్రియ




నల్గొండ, మార్చి 12:పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని, ప్రజలతో మమేకమై అవగాహన కల్పించి పర్యావరణ రక్షణకై వారిని చైతన్యం చేయాలని నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అరుణ ప్రియ అన్నారు. గురువారం యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2 ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణం- పరిశుభ్రత అనే అంశంపై ఎన్ఎస్ఎస్ వాలంటరీ నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం వాలంటీర్లు కళాశాల పరిసర ప్రాంతాలతో పాటు సమీపంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. మరో వైపు కళాశాల తరగతి గదుల్లోనూ సైతం శుభ్రం చేసి స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా ఉంటామన్నారు. వారంలో ఒక రోజైనా కచ్చితంగా శ్రమదానంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ మహమ్మద్ షరీఫ్, మ్యాతరి ఆనంద్, వివిధ శాఖల అధ్యాపకులు డాక్టర్ వి.శ్రీనివాస్, డాక్టర్ విజయ బాబు, డాక్టర్ మోహన్ రెడ్డి, డాక్టర్ పండరయ్య, డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ పనస రామకృష్ణ, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ అనిత కుమారి, డాక్టర్ అరవింద్, అనిల్ కుమార్, చక్రి, నాగార్జున, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే.. హాలీవుడ్ వచ్చినట్లే: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 12: నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు (గురువారం) ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ శ్రీ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఈఆఅ) చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారు : స్పీకర్ ఓంబిర్లా

న్యూఢిల్లీ, మార్చి 12:విపక్షాలు తనకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో ఇవాళ (గురువారం) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. తాను ఎల్లప్పుడూ ప్రతి ఎంపీకి సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులుకారని చెప్పారు.

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి స్పీకర్ ఓంబిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవని చెప్పారు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయన్నారు. ప్రధాని, మంత్రులు కూడా ఏదైనా ప్రకటన చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలని చెప్పారు.

మైక్రోఫోన్‌లను ఆన్ లేదా ఆఫ్ చేయడానికి స్పీకర్ దగ్గర ఎలాంటి బటన్ ఉండదని అన్నారు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసని చెప్పారు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుందని తెలిపారు. తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తున్న విమర్శలకు ఓంబిర్లా ఈ విధంగా సమాధానం ఇచ్చారు. విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది.

రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు దూరంగా ఉన్న స్పీకర్.. తీర్మానం వీగిపోగానే మళ్లీ యథావిధిగా విధులకు హాజరయ్యారు.

## విషాదం.. ఇద్దరు కూతుళ్లతో కలిసి తల్లి ఆత్మహత్య..

మహబూబ్ నగర్, మార్చి 12: మహబూబ్‌నగర్ జిల్లా భూతప్పూర్ మండలంలోని వెల్కిచర్ల గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు కూతుళ్లను బావిలో తోసిన తల్లి అనంతరం తానూ ఆత్మహత్యకు పాల్పపడింది. గత కొంత కాలంగా కుటుంబంలో చిన్న చిన్న గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. తీవ్ర మనస్థాపానికి గురైన జంగమ్మ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గురువారం ఉదయం జంగమ్మ(42) తన ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కలిసి దగ్గరలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది.

మొదట ఇద్దరు కూతుళ్లు జ్యోతి(15), శైలజ(13)ను బావిలో తోసింది. అనంతరం జంగమ్మ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే, ఆమె కుమారుడు భయంతో అక్కడ నుంచి తప్పించుకొని ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు మృతదేహాలను బావి నుంచి మృతదేహాలను వెలికి తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న గవర్నర్



యాదాద్రి, మార్చి12: యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరిగుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు

అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత.. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకే: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, మార్చి12: తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు.

రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

మరో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

## ఆస్తి పన్ను చెల్లింపుదారులకు జీహెచ్‌ఎంసీ గుడ్ న్యూస్

హైదరాబాద్, మార్చి 11: హైదరాబాద్ నగరవాసులకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గొప్ప శుభవార్త చెప్పింది. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేవారికి భారీ ఊరటనిస్తూ.. 'వన్ టైమ్ సెటిల్‌మెంట్'ని ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 2025-26 సంబంధించి ఆస్తి పన్నును ఈ నెల 31వ తేదీలోకా చెల్లిస్తే, వడ్డీపై ఏకంగా 90 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ వెల్లడించింది.

ఆస్తిపన్ను బకాయిలను ww.ghmc.gov.inని పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు.

అలాగే ఓఎఅజఖీఇ యాప్, మీ సేవ కేంద్రాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్లలోనూ చెల్లించవచ్చు. ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ తెలిపింది. ఈ మేరకు కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆస్తి పన్నుకు సంబంధించిన పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి సంకేతం నాణ్యమైన నిద్ర మాత్రమే !

## (13 మార్చి "ప్రపంచ నిద్ర దినోత్సవం" సందర్భంగా)

నేటి అత్యాధునిక వేగవంతమైన డిజిటల్ యుగంలో ఒత్తిడి, టెక్నాలజీ, రోజుకు దాదాపు 10 గంటల విధి నిర్వహణ లాంటి సవాళ్ల నడుమ గాఢ నిద్ర ఒక అరుదైన అనుభవం అవుతున్నది. నిద్ర ఒక సాధారణ విశ్రాంతి మాత్రమే కాదు నాణ్యమైన నిద్రతో శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యం సిద్ధిస్తుంది. నాణ్యమైన నిద్ర వల్ల జ్ఞాపక శక్తి, రోగ నిరోధకత, ఉత్పత్తి పెరుగుతాయి. మానవ శారీరక మానసిక ఎదుగుదలకు పునాదిగా మంచి నిద్ర ఉపకరిస్తున్నది. 2008 నుంచి ప్రతి ఏట వసంత కాలంలో సమరాత్రి (రాత్రి పగలు సమాన గంటలు) రోజు, అనగా మార్చి 10 – 20 తారీఖుల మధ్య వచ్చే శుక్రవారం రోజున, అనగా 13 మార్చి 2026 రోజున "ప్రపంచ నిద్ర దినోత్సవం(వరల్డ్ స్లీప్ డే)"పాటించడం జరుగుతోంది. ప్రపంచ నిద్ర దినోత్సవ వేదికగా ప్రజల్లో నిద్ర ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు నిద్ర లేమి ఫలితాల వివరణ, ఆరోగ్యకర నిద్ర అలవాట్లు, నిద్ర ప్రయోజనాలు లాంటివి చర్చించడం జరుగుతున్నది.

### నాణ్యమైన నిద్ర ఆరోగ్య ప్రయోజనాలు:

మంచి నిద్ర ద్వారా వ్యక్తుల నిర్ణయం తీసుకునే సామర్థ్యం, పనిలో ఏకాగ్రత, ఉత్తమ ఉత్పత్తి లాంటి ప్రధాన ప్రయోజనాలు వస్తాయి. నాణ్యమైన నిద్రతో భావోద్వేద నియంత్రణ, స్థిరమైన మానసిక స్థితి, ఒత్తిడి లేమి, సమస్యల పరిష్కార సామర్థ్యం, చురుకైన శారీరక కదలికలు, సరైన జీర్ణక్రియ, సక్రమ జీవక్రియలు, కండరాల రిపేర్, హార్మోన్ల ఉత్పత్తి, సరైన బీపీ, హృద్రోగాల కట్టడి లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. నిద్ర లేమి వల్ల మానసిక చంచలత్వం, చికాకు, ఒత్తిడి, ఆందోళన లాంటి పలు అనారోగ్యాలు కలుగుతాయి.

### ప్రపంచ నిద్ర దినోత్సవం-2026 ఇతివృత్తం:

2026 ప్రపంచ నిద్ర దినోత్సవం ఇతివృత్తంగా "నాణ్యమైన నిద్ర పొండి, ఆరోగ్యంగా జీవించండి (స్లీప్ వెల్, లివ్ బెట్టర్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. నిద్ర వల్ల శరీర అవయవాలన్నీ విశ్కడరాంతి తీసుకుంటాయనే అభిప్రాయం సరైనది కాదు. వ్యక్తి నిద్రలో ఉన్నపుడు తన శరీర అవయవాలు, మెదడు చురుకుగా పని చేస్తూ మన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉత్పాదకత, భావోద్వేగ సమతాస్థితి ఒనగూడుతాయి. ఒక సాధారణ వయోజనుడు ప్రతి రోజు 7 – 9 గంటలు నిద్ర పోవడం జరుగుతుంది. పని ఒత్తిడిలో తరుచుగా నిద్రకు సరైన సమయం కేటాయించని యెడల నిద్రలేమి వల్ల ప్రాణాంతక వ్యాధులు కూడా అనుభవించాల్సి వస్తుందని తెలుసుకోవాలి.

### ప్రపంచ నిద్ర దినోత్సవ కార్యక్రమాలు:

ప్రపంచ నిద్ర దినోత్సవం వేదికగా నిద్ర ప్రాధాన్యతను ప్రచారం చేయడంతో పాటు నిద్రలేమి దుష్ఫలితాలను వివరించడం జరుగుతుంది.

నిద్రతో ఆరోగ్యానికి ఉన్న ప్రత్యక్ష సంబంధాలను వివరించడం, నిద్ర కేంద్రంగా సెమినార్ల నిర్వహణ, నిద్ర పట్ల లోతైన పరిశోధనల అవసరం, నిద్ర లేమి సవాళ్లు, సడలింపు పద్ధతులు, ఉత్పాదకతకు చేయూత, నాణ్యమైన జీవనశైలి పాటించడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది.

ఒక నిష్కల్మష నవ్వు, నాణ్యమైన నిద్ర అనేవి అనేక రోగాల నివారణకు ఉత్తమ ఔషధాలని భావించాలి. నిద్ర అనేది ఒక రకమైన ధ్యానం లాంటిది.

మన భవిష్యత్తు మనం కనే కలల మీద ఆధారపడి ఉన్నందున, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం మన కనీస అవసరం అని తెలుసుకోవాలి. నిరాశకు ఆశకు మధ్య వారధిగా నాణ్యమైన రాత్రి నిద్ర ఉపయోగపడుతుందని మరువరాదు.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారతదేశంతో భూ సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే పెట్టుబడుల మార్గదర్శకాలలో మార్పులకు ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్

న్యూఢిల్లీ, మార్చి 12:భారతదేశంతో భూ సరిహద్దును పంచుకునే దేశాల (ఎల్‌బీసీ) నుంచి వచ్చే పెట్టుబడులకు సంబంధించిన మార్గదర్శకాలలో సవరణలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

మనీ లాండరింగ్ నిరోధక నియమాలు- 2003 (పీఎంఎల్‌ఏ) ప్రకారం పెట్టుబడిదారుల సంఘం విస్తృతంగా ఉపయోగించే 'వాస్తవ యాజమాన్యం' నిర్వచనం, ప్రమాణాలను ఈ సవరణ అందిస్తుంది.

ఈ వాస్తవ యాజమాన్యం పరీక్షను పెట్టుబడి పెట్టే సంస్థ స్థాయిలో వర్తింపజేస్తారు.

నియంత్రణ అధికారం లేని ఎల్‌బీసీ వాస్తవ యాజమాన్యం 10 శాతం వరకు ఉన్న పెట్టుబడిదారులను సంబంధిత రంగాల పరిమితులు, నిబంధనలకు లోబడి 'స్వయం చాలిత మార్గం' కింద అనుమతిస్తారు. అటువంటి పెట్టుబడులకు సంబంధించి పెట్టుబడి పొందే సంస్థ దానికి సంబంధించిన వివరాలను డీపీఐఐటీకి నివేదించాల్సి ఉంటుంది.

మూలధన వస్తువులు, ఎలక్ట్రానిక్ మూలధన వస్తువులు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పాలీసిలికాన్, ఇంగాట్-వేఫర్ వంటి తయారీ రంగాలకు సంబంధించి ఎల్‌బీసీ పెట్టుబడి ప్రతిపాదనలను 60 రోజుల్లోపు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.

క్యాబినెట్ కార్యదర్శి ఆధ్వర్యంలోని కార్యదర్శుల కమిటీ (సీఓఎస్) ఈ నిర్దిష్ట రంగాల జాబితాను అవసరానికి అనుగుణంగా సవరించవచ్చు.

ఈ సందర్భాల్లో పెట్టుబడి పొందే సంస్థ మెజారిటీ వాటా, నియంత్రణ నివాసితులైన భారతీయ పౌరుడు(లు) లేదా స్థానిక భారతీయ సంస్థ(లు) వద్ద ఉండటమే కాకుండా దీని నియంత్రణ ఎల్లప్పుడూ నివాసిత భారతీయుల వద్దే ఉండాలి.

కోవిడ్-19 మహమ్మారి కారణంగా భారతీయ కంపెనీలను అవకాశవాదంగా చేజిక్కించుకోవడం లేదా కొనుగోలు చేయడాన్ని అరికట్టడానికి ప్రభుత్వం 17. 04.2020 నాటి 'ప్రెస్ నోట్ 3 (2020)' (పీఎన్3) ద్వారా అప్పటి ఎఫ్‌డీఐ విధానాన్ని సవరించింది. పీఎన్3 ప్రకారం భారత్‌తో భూ సరిహద్దును పంచుకునే దేశానికి చెందిన ఏదైనా సంస్థ లేదా భారత్‌లో పెట్టే పెట్టుబడికి 'వాస్తవ యజమాని' సంబంధిత దేశంలో ఉన్నా లేదా ఆ దేశ పౌరుడైనా సరే వారు కేవలం ప్రభుత్వ అనుమతి ద్వారా మాత్రమే పెట్టుబడి పెట్టగలరు. దీనికి అదనంగా భారత్‌లో ఒక సంస్థలో ఇప్పటికే ఉన్న లేదా భవిష్యత్తులో వచ్చే ఎఫ్‌డీఐ ద్వారా యాజమాన్య బదిలీ జరిగినప్పుడు దాని ఫలితంగా 'వాస్తవ యజమాన్యం' పైన పేర్కొన్న దేశాల పరిధిలోకి వస్తే దానికి కూడా ప్రభుత్వ ముందస్తు ఆమోదం తప్పనిసరి.

వ్యూహాత్మక ప్రయోజనం లేని, నియంత్రణ అధికారం లేని స్వల్ప వాటాలు కలిగిన ఎల్‌బీసీ పెట్టుబడిదారులకు కూడా పీఎన్3 ఆంక్షలు వర్తింపజేయడం వల్ల ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ వంటి గ్లోబల్ ఫండ్స్ నుంచి వచ్చే పెట్టుబడుల ప్రవాహంపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు గుర్తించారు.

ఈ కొత్త మార్గదర్శకాలు భారత్‌లో వ్యాపార నిర్వహణను సులభతరం చేయటంతో పాటు పెట్టుబడుల విషయంలో స్పష్టతనిస్తాయని భావిస్తున్నారు. ఇవి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) ప్రవాహాన్ని పెంచడమే కాకుండా సరికొత్త సాంకేతికతలను పొందడానికి, దేశీయ విలువ జోడింపు, భారతీయ కంపెనీల విస్తరణ, ప్రపంచ సరఫరా గొలుసుతో అనుసంధానమవడానికి దోహదపడతాయి. ఇది పెట్టుబడులు, తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశంగా భారత్ పోటీతత్వాన్ని పెంపొందించడానికి సహాయపడుతుంది. పెరిగిన ఎఫ్‌డీఐ పెట్టుబడులు దేశీయ మూలధనానికి అదనపు బలాన్ని ఇస్తాయి.. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు మద్దతుగా నిలుస్తాయి.. మొత్తం ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తాయి.

# 'మత్తుకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలి'

**– ఈగల్ ఫోర్స్ సీఐ హేమా రాణి పిలుపు**

ఖమ్మం, మార్చి 12:మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని, యువత వీటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఈగల్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హేమ రాణి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో పోలీస్, ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు' నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి సీఐ హేమ రాణి మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వల్ల గుండెపోటు, క్యాన్సర్, కాలేయం, ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తాయని, మెదడు పనితీరు మందగిస్తుందని తెలిపారు. మత్తుకు బానిసలైన వారిలో తీవ్ర ఆందోళన, డిప్రెషన్, ఆత్మహత్య ధోరణులు పెరుగుతాయని చెప్పారు. వ్యసనాల వల్ల కేవలం వ్యక్తే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయని, ఆర్థికంగా, చట్టపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వెల్లడించారు.

ఎవరైనా డ్రగ్స్ తీసుకోమని బలవంతం చేసినా ధైర్యంగా 'నో' చెప్పే సంకల్పం విద్యార్థుల్లో ఉండాలన్నారు. అమూల్యమైన మానవ జీవితాన్ని మత్తు పదార్థాలతో పాడు చేసుకోవద్దని విద్యార్థుల చేత సీఐ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమం చంద్రుగొండ క్రాస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి, విద్యా శాఖ అధికారి బానోత్ జూంకిలాల్, పీహెచ్‌సీ వైద్యులు బానోత్ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్ఎం లక్ష్మీ నర్సయ్య, నేతాజీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ



వరంగల్, మార్చి 12: విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా కష్టపడి చదివి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి, పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని దాత రఘునాయకుల ప్రమోద్ రెడ్డి సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. దాత ప్రమోద్ రెడ్డి ఆదేశాల మేరకు వార్డు సభ్యులు ఒద్దుల శ్రీకాంత్, దామెర నరేష్ లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునని అన్నారు. అలాగే పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని, పరీక్ష సమయాన్ని సక్రయంగా వినియోగించు కోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీదేవి ఉపాధ్యాయులు దయాకర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని 5 జిల్లాల మీదుగా సాగే రెండు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 12:రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రెండు ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. వీటి మొత్తం అంచనా వ్యయం సుమారు రూ. 4,474 కోట్లు.

ఈ రైలు మార్గాల ప్రాజెక్టులలో సైంథియా – పాకూర్ 4వ లైన్, సంత్రాగచ్చి – ఖరగ్‌పూర్ 4వ లైన్ ఉన్నాయి.

లైన్ సామర్థ్యం పెరుగుదల వల్ల రైళ్ల రాకపోకలు మరింత మెరుగుపడతాయి. దీనివల్ల భారతీయ రైల్వే పనితీరు, సేవల పట్ల విశ్వసనీయత పెరుగుతుంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రతిపాదనలు రైళ్ల నిర్వహణను సులభతరం చేస్తాయి. రద్దీని తగ్గిస్తాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'నవ భారత్' దార్శనికతకు అనుగుణంగా చేపట్టే ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ సమగ్ర అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ వారిని ఆత్మనిర్భర్ గా మారుస్తాయి.

పీఎం-గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా మల్టీ-మోడల్ కనెక్టివిటీని, రవాణా సామర్థ్యాన్ని పెంపొందించడం వీటి ప్రధాన లక్ష్యం. ఇవి ప్రజల ప్రయాణాలకు, సరుకులు, సేవల రవాణాకు ఆటంకం లేని అనుసంధానాన్ని అందిస్తాయి.

పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని అయిదు జిల్లాల మీదుగా సాగే ఈ రెండు ప్రాజెక్టులు భారతీయ రైల్వే ప్రస్తుత రైలు మార్గాలను సుమారు 192 కిలోమీటర్ల మేర పెంచుతాయి.

ఆమోదం పొందిన ఈ మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టు సుమారు 147 లక్షల జనాభా ఉన్న దాదాపు 5,652 గ్రామాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది.

ప్రతిపాదిత సామర్థ్య పెంపు దేశంలోని పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. వీటిలో బోల్పూర్-శాంతినికేతన్, నందికేశ్వరి ఆలయం (శక్తిపీఠం), తారాపీఠ్ (శక్తిపీఠం), పటచిత్ర గ్రామం, ధాడికా అడవి, భీంబంద్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, రామేశ్వర కుండ్ మొదలైనవి ఉన్నాయి.

# రూ.100 కోట్లతో అమ్యూజ్‌మెంట్ పార్క్, రిసార్ట్ ప్రాజెక్ట్




అమరావతి, మార్చి 12: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మరో కీలక అడుగు వేసింది. విశాఖపట్నంలో అత్యాధునిక అమ్యూజ్‌మెంట్ పార్క్, రిసార్ట్ అభివృద్ధి కోసం మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్‌తో మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ముంబయిలో జరిగిన ఎంఐఎ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్) ఎక్స్‌పో-2026 వేదికగా పర్యాటక శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'లో భాగంగా, వినోద రంగాన్ని రాష్ట్ర పర్యాటక వృద్ధికి ప్రధాన చిహ్నంగా మలిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్క్, రిసార్ట్ విస్తరించి ఉండేలా ప్రణాళికలు రచించామన్నారు.

ఇందులో 100 గదుల సామర్థ్యం కలిగిన విలాసవంతమైన రిసార్ట్ ఉంటుందని, సుమారు 300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. "మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రధాన కేంద్రంగా 2017లో ప్రారంభమైన మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్, వినోద రంగంలో దాదాపు తొమ్మిదేళ్ల అనుభవం కలిగి ఉంది. మోడర్న్ గ్రూప్ ఆధ్వర్యంలో వీరు 'మస్తీ ల్యాండ్' బ్రాండ్‌తో అమ్యూజ్‌మెంట్ పార్కులు, గేమింగ్ జోన్లు, రెస్టారెంట్లు, రిసార్టులను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ నిర్వాహకులకు ఈ రంగంలో 40 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉందని" మంత్రి దుర్గేష్ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశాఖపట్నం నగరం గ్లోబల్ కోస్టల్ టూరిజం హబ్‌గా వేగంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. నగరంలో మెగా అమ్యూజ్‌మెంట్ పార్కులను ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి వినోద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

'కొత్త ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024-2029' ప్రకారం ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అన్ని అనుమతులను త్వరితగతిన మంజూరు చేయనుందన్నారు. ఈ విధానం కింద 25 శాతం వరకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, పారిశ్రామిక టారిఫ్‌ల ప్రకారం విద్యుత్ సరఫరా, 100 శాతం నెట్ ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

# గ్రీన్ ఫీల్డ్ కనెక్టివిటీ నిర్మాణానికి సవరించిన అంచనా వ్యయానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 12:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీలో ఉత్తరప్రదేశ్, హర్యానా మధ్య ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే (ఢిల్లీ- ఫరీదాబాద్- బల్లభ్‌గఢ్- సోహ్నా అనుసంధాన రహదారి) నుంచి జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ కనెక్టివిటీ నిర్మాణం కోసం సవరించిన అంచనా వ్యయం రూ.3630.77 కోట్లకు ఆమోదం లభించింది.

31.42 కి.మీ. పొడవైన ఈ ప్రాజెక్టు ద్వారా దక్షిణ ఢిల్లీ, ఫరీదాబాద్, గురుగ్రామ్ నుంచి జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరుగా, వేగంగా వెళ్లేందుకు వీలుంటుంది.

ఇది జాతీయ రాజధాని ప్రాంతంలో (ఎన్‌సీఆర్) ఆర్థిక వృద్ధిని, రవాణా సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఈ కారిడార్ తూర్పు పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే, యమునా ఎక్స్‌ప్రెస్‌వే, ప్రత్యేక సరకు రవాణా కారిడార్ (డీఎఫ్‌సీ)లను అనుసంధానించి, వివిధ రవాణా వ్యవస్థల కలయికకు వేదికగా నిలుస్తుంది.

ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పరమైన మెరుగుదల మాత్రమే కాక.. పట్టణ ప్రాంతంలో విప్లవాత్మక మార్పులకు, ప్రాంతీయ అనుసంధానానికి, జాతీయ రవాణా సామర్థ్యానికి వ్యూహాత్మకంగా నిలుస్తుంది. జెవార్ విమానాశ్రయం-ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే కారిడార్ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయటానికి, ఫరీదాబాద్‌లో స్థిరమైన పట్టణాభివృద్ధికి దీని నిర్మాణం అత్యంత కీలకం.

# మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా: కేంద్ర మంత్రివర్గ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 12:తమిళనాడులోని మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదాని ప్రకటిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ రోజు నిర్వహించిన మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

టెంపుల్ సిటీగా పిలిచే తమిళనాడులోని మధురై విమానాశ్రయం ఆ రాష్ట్రంలోని పాత విమానాశ్రయాల్లో ఒకటి. దక్షిణ తమిళనాడుకి ఇది ముఖద్వారంగా ఉంది. పర్యాటకాన్ని, తీర్థయాత్రలను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుంది.

మధురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ హోదా స్థాయికి పెంచడం ద్వారా ప్రాంతీయంగా రవాణా సదుపాయం విస్తరిస్తుంది. వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి మెరుగవుతాయి. ఈ నగర చారిత్రక ప్రాముఖ్యతకు సరితూగేలా అంతర్జాతీయ భక్తులను, వ్యాపారాలను ఈ విమానాశ్రయం ఆకర్షిస్తుంది.



# భవిష్యత్తులో అధికారంలోకి వైసిపి పార్టీ యే..

## 16వ వసంతంలోకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఘనంగా వేడుకలు



అమరావతి, మార్చి 12: రాష్ట్రంలో రాబోయేది వైఎస్ఆర్సిపి పార్టీయే అని రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనాలకు వేదిక వైఎస్ఆర్సిపి పార్టీ అని ఎమ్మెల్సీ ఇస్సాకు బాషా వైసిపి పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వి వి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ శేఖర్ రెడ్డి, మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి అమృత రాజ్, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ అజాద్ లు పేర్కొన్నారు.నంద్యాలలో గురువారం ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మడమ తిప్పని పంతం,అడుగు తప్పని గమ్యం 16వ ఏట వైఎస్సార్‌సీపీ ప్రస్థానం లోకి అడుగుపెట్టిందని పేర్కొన్నరు.

ప్రజా గుండెల్లో వైఎస్సార్‌సీపీ 5 ఏళ్ల నమ్మకంతో మరో పోరాటానికి సిద్ధం గా ఉండాలని పిలుపునిచ్చారు.వైఎస్సార్ ఆశయాలకు వారసుడు 15 ఏళ్ల వైఎస్ జగన్ సుదీర్ఘ రాజకీయ ప్రయాణం!, కష్టాల నుంచి కోట్లాది మంది ఆశల వరకు.. వైఎస్సార్‌సీపీ 15 ఏళ్ల విజయగాథ! ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పుట్టిన పార్టీ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేటితో 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగుపెడుతోందని కార్యకర్తలకు పిలుపునిచ్చరు.రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకుంటున్నా యన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధనే లక్ష్యంగా.. ఓదార్పు యాత్ర ద్వారా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు.

ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన నేతగా ప్రజలకు చేరువయ్యారన్నారు.ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష ఆధ్వర్యంలో వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా ,ఎస్ ఈ సి మెంబర్ రామలింగారెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్,మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, స్టేట్ లీగల్ సెల్ అధికార ప్రతినిధి తిమ్మారెడ్డి,రాష్ట్ర మహిళ విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి అమృత రాజ్, వైసీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, జిల్లా సెక్రెటరీ లు దేవనగర్ బాషా, శివనాగిరెడ్డి, వైసీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కారు రవికుమార్, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు టి వి రమణ, మున్సిపల్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు వార్డు ఇన్చార్జిలు వైసిపి నాయకులు, కార్యకర్తలు, హాజరయ్యారు.అభిమానులు ముందుగా దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.

పార్టీ కార్యాలయం ఆవరణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ జెండాను వైసీపీ నేతలు ఆవిష్కరిం చారు. ప్రజల సంక్షేమం కోసం కులమతాలకు, వర్గాలకు, ధనిక, పేద అనే బేధం లేకుండా ప్రజల సంక్షేమమే ఊపిరిగా నిరంతరంగా కృషి చేసి 15 ఏళ్ళు పూర్తి చేసుకొని నేడు 16వ వసంతంలోకి అడుగిడుతున్న శుభ సంధర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఓదార్పు యాత్ర నుండి వేసిన అడుగులు ప్రజల సంక్షేమం దిశగా పోరాటాలు చేస్తూ నేటికి 15 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా అభివృద్ధి పథంలో నడిపిన ఏకైక పార్టీగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.రాజకీయ ప్రస్థానంలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్క వైసీపీ నేతలకు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు సరికొత్త ఉత్సాహంతో పార్టీని మరింత భలోపతం చేయాలని, రానున్న ఎన్నికల్లో మరోసారి రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

అమరావతి, మార్చి 12:స్థానిక శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు గురువారం తిరువూరు మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కపాలెంలో ముత్యాలమ్మ దేవస్థానంలో ఇటీవల బొడ్డురాయి ప్రతిష్ట జరగగా, ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పర్వతనేని జగన్, సభ్యులు నాగిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దినేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రావూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని దోమతోటి వెంకట కృష్ణకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 46,084 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. గ్రామ సచివాలయం సందర్శించిన ఎమ్మెల్యే స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# ప్రజల పక్షాన నిలబడింది వైసీపీ

**-16సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో**
**-జగనన్న పాలన కోసం ప్రజలు ఎదురుచూపులు.**
**-వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో..**
**-డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ రెడ్డి..**

అమరావతి, మార్చి 12: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సెంట్రల్ నియోజకవర్గ పరిధి లోని అన్ని డివిజన్లలో వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సందర్భంగా స్థానిక 58వ డివిజన్ ప్రాంతంలో వైసీపీ శ్రేణులు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వీఎంసీ డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ రెడ్డి పాల్గొని పార్టీ జెండా ఎగరవేసి,అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు.

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైస్సార్ మరణాంతరం ఆయన ఆశయాల కోసం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి వైసీపీ పార్టీని స్థాపించి ప్రజల పక్షాన నిలబడి మద్దతు పొందిందని అన్నారు. వై.ఎస్.జగన్ పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకొన్నారని అన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా పాలనకు వ్యతిరేకంగా వైసీపీ పోరాటాలు నిర్వహించిందని అన్నారు. వైసీపీ పార్టీ పోరాటాల ఫలితంగా వై.ఎస్ జగన్ 2019లో ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పదవీ భాధ్యతలు స్వీకరించి అనేక పథకాలు ఇంటి ముంగిటకు రేషన్, సచివాలయం, వాలేంటీర్ వ్యవస్థ తీసుకుని వచ్చి ప్రజల మన్నలను పొందారని అన్నారు.

టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మరొకసారి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రి బాధ్యతలు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజారెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# వైఎస్ ఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

## -నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



విజయవాడ,మార్చి 12: దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లామని జగ్గయ్యపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. గురువారం యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో వైకాపా నేత తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

విజయవాడ రోడ్ లోని వైయస్సార్ విగ్రహానికి వైకాపా పార్టీ నాయకులు అభిమానులతో కలిసి పూలమాలవేసి తన్నీరు నాగేశ్వరరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ? ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన పార్టీ వైకాపా పార్టీ అన్నారు. రైతులు మహిళలు విద్యార్థులు పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు గత ప్రభుత్వంలో అమలు చేసినట్లు వివరించారు. గ్రామ వార్డు సచివాలయాలు వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజల గడప వద్దకు సంక్షేమ పాలన తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు మహిళలు అభిమానులు పాల్గొన్నారు.

# 'హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతి'లో నిర్మాణం... ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ, మార్చి 12:'ఎనహెచ్-752డీ'లోని 80.45 కిలోమీటర్ల పొడవైన బద్నావర్-పెట్లవాడ్-తాండ్ల-తిమర్వాణి విభాగాన్ని 4 వరుసల కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం మూలధన వ్యయాన్ని రూ. 3,839.42 కోట్లుగా నిర్ణయించారు.

ఆమోదం పొందిన ఈ కారిడార్ ఉజ్జయిని నగరాన్ని ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ రహదారిలోని (డీఎంఈ) తిమర్వాణి ఇంటర్‌ఛేంజ్‌తో అనుసంధానిస్తుంది.

ప్రయాణ సామర్థ్యాన్ని మెరుగుపరచాలన్న లక్ష్యంతో ఈ ప్రతిపాదిత నాలుగు వరుసల ప్రాజెక్టు కారిడార్‌ను చేపడుతున్నారు. దీనివల్ల ప్రయాణ సమయం సుమారు ఒక గంట వరకు తగ్గుతుందన్న అంచనా ఉంది. ఇప్పటికే 70.40 కిలోమీటర్ల పొడవున్న ఉజ్జయిని-బద్నావర్ సెక్షన్‌ను రెండు వరుసల నుంచి నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఉన్న బద్నావర్-తిమర్వాణి రహదారి కేవలం 5.5 మీటర్ల వెడల్పుతో తక్కువ వేగ పరిమితి (గంటకు 20-50 కి.మీ) కలిగిన సాధారణ మార్గంగా ఉంది. ఈ విభాగాన్ని అప్‌గ్రేడ్ చేయటం ద్వారా ఉజ్జయిని నుంచి ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ రహదారిలోని (డీఎంఈ) తిమర్వాణి ఇంటర్‌ఛేంజ్ వరకు గంటకు 80-100 కి.మీ వేగంతో ప్రయాణించేలా నేరుగా 4 వరుసల అనుసంధానం లభిస్తుంది.

గుజరాత్, మహారాష్ట్రల నుంచి ఉజ్జయినికి వచ్చే వాహనాలకు తిమర్వాణి- తాండ్ల-పెట్లవాడ్-బద్నావర్-ఉజ్జయిని కారిడార్ అత్యంత తక్కువ దూరమున్న మార్గం. తిమర్వాణి- బద్నావర్ విభాగాన్ని అప్‌గ్రేడ్ చేయడం వల్ల అంతర్రాష్ట్ర అనుసంధానం బలోపేతం అవుతుంది. ఇది వాహనాల రాకపోకలను మరింత సమర్థవంతంగా చేయడమే కాకుండా 2028 ఏప్రిల్‌లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' సమయంలో పెరిగే విపరీతమైన ట్రాఫిక్ రద్దీని మెరుగ్గా నిర్వహించేందుకు కూడా ఎంతగానో దోహదపడుతుంది.

బద్నావర్- పెట్లవాడ్-తాండ్ల-తిమర్వాణి విభాగం.. ధార్, ఝాబువా జిల్లాలలోని గిరిజన ప్రాంతాల గుండా వెళుతుంది. ధార్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలు నీతి ఆయోగ్ చేపట్టిన 'ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం' పరిధిలోకి వస్తాయి. ఈ రహదారి అభివృద్ధి వల్ల ఉజ్జయిని-బద్నావర్-తిమర్వాణి కారిడార్ నుంచి ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ రహదారికి నేరుగా వేగవంతమైన ప్రయాణ సౌకర్యం కలుగుతుంది. ఈ మెరుగైన అనుసంధానం రవాణా ఖర్చులను తగ్గిస్తుంది.. ముడి పదార్థాలు, తయారీ వస్తువుల వేగవంతమైన రవాణాకు సహకరిస్తుంది. ఇండోర్, పీతాంపూర్, ఉజ్జయిని, దేవాస్‌లలో ఉన్న పారిశ్రామిక కేంద్రాలు, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులకు (ఎంఎంఎల్‌పీ) చేరుకోవటాన్ని సులభతరం చేస్తుంది.

ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ మెరుగైన భద్రత, అంతరాయం లేని వాహనాల రాకపోకల కోసం రూపొందించిన హై-స్పీడ్ అనుసంధానతను అందిస్తుంది. ఇది ప్రయాణ సమయం, ట్రాఫిక్ రద్దీ, వాహన నిర్వహణ ఖర్చులను తగ్గిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ఈ ప్రాంతంలోని ప్రాథమిక మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుంది. తద్వారా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ధార్, ఝాబువా జిల్లాల సమగ్ర ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది.

# 'ఏడీసీ-150' ఇన్-ఫ్లైట్ రిలీజ్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన డీఆర్‌డీఓ, భారత నౌకాదళం

న్యూఢిల్లీ, మార్చి 12:రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ - డీఆర్డీఓ), భారత నౌకాదళం సంయుక్తంగా ఫిబ్రవరి 21 నుంచి మార్చి 01, 2026 మధ్య గోవా తీరంలో పీ8ఐ విమానం ద్వారా స్వదేశీ ఎయిర్ డ్రాపబుల్ కంటైనర్ 'ఏడీసీ-150' నాలుగు ఇన్ - ఫ్లైట్ రిలీజ్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించాయి. వివిధ కఠినమైన పరిస్థితుల్లో ఈ ప్రయోగాలు జరిగాయి.

150 కిలోల బరువును మోసుకెళ్లేలా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ ఎయిర్ డ్రాపబుల్ కంటైనర్ నౌకాదళ రవాణా సామర్థ్యాన్ని పెంచుతుంది. తీరానికి దూరంగా నౌకలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారికి అవసరమైన పరికరాలు, వైద్య సహాయం వంటివి త్వరగా అందించడానికి ఇది ఉపయోగపడుతుంది.

విశాఖపట్నంలోని నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ (ఎన్ఎస్టీఎల్) ఈ ప్రాజెక్టుకు నోడల్ లాబొరేటరీగా వ్యవహరించింది.

ఆగ్రాలోని ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడీఆర్డీఈ) పారాచూట్ వ్యవస్థ ను అభివృద్ధి చేయగా, బెంగళూరులోని సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్దినెస్ అండ్ సర్టిఫికేషన్ (సీ ఈ ఎంఐఎల్ఏసీ) ఈ విమాన ప్రయోగాలకు అవసరమైన అనుమతులు, ధృవీకరణను అందించింది. హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డీఆర్డీఎల్) ఈ పరీక్షలకు అవసరమైన ఇన్‌స్ట్రుమెంటేషన్ (పరికరాల) మద్దతును అందించింది.

భారత నౌకాదళ అవసరాలను తీర్చడానికి, పీ8ఐ విమానం కోసం ఉద్దేశించిన ఏడీసీ -150 వ్యవస్థను అతి తక్కువ సమయంలోనే అభివృద్ధి చేసి, అర్హత పరీక్షలను పూర్తి చేశారు. అభివృద్ధి దశలోని విమాన పరీక్షలన్నీ విజయవంతంగా ముగియడంతో, ఈ వ్యవస్థ త్వరలోనే భారత నౌకాదళంలో చేరనుంది.







# పశ్చిమాసియా సంక్షోభం: ఈనెల 12 నుంచి మరిన్ని ప్రాంతాలకు భారతీయ విమానాలు

న్యూఢిల్లీ, మార్చి 12: పశ్చిమాసియా ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను, ఈ ప్రాంతానికి, భారత్‌కు మధ్య విమానయానంపై పడే ప్రభావాన్ని పౌర విమానయాన శాఖ నిశితంగా పరిశీలిస్తోంది. పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సత్వర, సమన్వయ చర్యలను చేపట్టేందుకు సంబంధిత వర్గాలతో నేరుగా చర్చిస్తున్నారు. ప్రయాణికుల భద్రత, సేవలను కొనసాగించడమే ప్రాథమికంగా పరిగణనలోకి తీసుకొని, మారుతున్న పరిస్థితులకు తగినట్టుగా అవసరమైన ఏర్పాట్లను విమానయాన సంస్థలు చేపడుతున్నాయి.

2026, మార్చి 9 నాటి సమాచారం ప్రకారం పశ్చిమాసియా నుంచి భారత్‌కు దేశీయ విమానయాన సంస్థలు 45 విమానాలను నడిపాయి. వీటి ద్వారా 7,407 మంది ప్రయాణించారు.ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం, తరలింపు అవసరమైన చోట మద్దతు అందించ డానికి కార్యాచరణ సౌలభ్యాన్ని భారతీయ విమానయాన సంస్థలు కోరుతున్నాయి. అదనపు అరైవల్, డిపార్చర్ స్లాట్లను అందించడానికీ, దుబాయి, అబుదాబి, షార్జా, రస్-అల్-ఖైమా, అల్-అలన్, ఫుజైరా, షార్జా, జెడ్డా, మదీనాతో సహా ఇతర ప్రాంతాలకు వచ్చే లేదా అక్కడి నుంచి బయలుదేరే విమానాలకు ప్రత్యామ్నాయ విమానాశ్రయంగా మస్కట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఉపయోగించుకోవడానికి వీలుగా సంబంధిత అధికారవర్గాలతో డీజీసీఏ సమన్వయం చేస్తోంది.

2026 మార్చి 12 నుంచి రియాద్ నుంచి ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు నడుపుతాయని ఎయిర్‌లైన్స్ కార్యాచరణ ప్రణాళికలు తెలియజేస్తున్నాయి. ఇండిగో సైతం అదే రోజు నుంచి ముంబయి-రియాద్-ముంబయి సేవలను ప్రారంభిస్తుంది.

ఈ ప్రాంతం లో ప్రయాణ భద్రత, సౌలభ్యాన్ని కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ విమానాశ్రయ అనుమతులను పొందేందుకు స్పైస్‌జెట్‌కు అవకాశం లభించింది. 2026 మార్చి 12 నుంచి ఆకాశ ఎయిర్ తన కార్యకలాపాలను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో, ప్రస్తుత కార్యాచరణ పరిస్థితులకు అనుగుణంగా ముంబయి -రియాద్ -ముంబయి సర్వీసులను నిర్వహించాలని ఆ సంస్థకు సూచించారు.

ప్రయాణికుల రాకపోకలు క్రమబద్ధంగా సాగేలా చూసేందుకు ఎయిర్‌లైన్స్, సంబంధిత ఇతర సంస్థలతో మంత్రిత్వ శాఖ నిరంతరం సమన్వయం చేసుకుంటోంది. ఈ సమయంలో విమానయాన ఛార్జీలు సహేతుకంగా ఉండేలా, అసంబద్ధంగా ధరలను పెంచకుండా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. ఫ్లైట్ సమయాలు, ప్రయాణ ఏర్పాట్లకు సంబంధించిన తాజా సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించారు. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోన్న మంత్రిత్వ శాఖ అవసరాన్ని బట్టి సమాచారాన్ని అందిస్తుంది.

# 'రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి'

ఖమ్మం, మార్చి 12: కోయగూడెం ఓసీలో పనులు నాణ్యతతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ముందుకు సాగాలని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి సంస్థకు చెందిన కార్పొరేట్ ఉన్నతాధికారులు డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్‌వీ. సూర్యనారాయణ, జీఎం (సీపీపీ) ఏ.మనోహర్, జీఎం (క్వాలిటి) రవికుమార్ అన్నారు. టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌ను గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా కేవోసీలో వ్యూ పాయింట్ నుండి పని స్థలాలను అక్కడ జరుతున్న పనులు పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో జరుగు తున్న బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను భద్రతా చర్యలు, యంత్రాల పని తీరు అంశాలను అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.అంతేకాక బొగ్గు నాణ్యత సామర్థ్యం పెంచే జీ 19 బొగ్గు ఉత్పత్తి అయ్యేలాగా చూడాలని, ఉపరితల గనుల్లో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి తీయాలని అన్నారు.

# భారత్ టాక్సీ సేవలు ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 12:ఉపాధి కల్పన, సామాజిక భద్రత, స్థానిక ఆర్థికాభివృద్ధి సాధనాలుగా సహకార సంస్థలను శక్తిమంతం చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. యాజమాన్యం, నిర్వహణ, విలువ సృష్టికి కేంద్రంగా, డ్రైవర్లు సారథులుగా రవాణా రంగంలో చేపట్టిన పరివర్తనాత్మక కార్యక్రమమే భారత్ టాక్సీ. ఈ కార్యక్రమం అగ్రిగేటర్-ఆధారిత నమూనాలకు సుస్థిరమైన, గౌరవప్రదమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. "భారత్ టాక్సీ" భారత సహకార ఆధారిత తొలి రైడ్-హెయిలింగ్ వేదిక. 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతకు అనుగుణంగా... సహకార రంగ బలోపేతం దిశగా... సమ్మిళిత, పౌర-కేంద్రిత రవాణా పరిష్కారాలను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇది కీలక ముందడుగు. బహుళ-రాష్ట్ర సహకార సంఘాల చట్టం-2002 కింద నమోదైన, సహకార రంగంలో పనిచేస్తున్న 8 జాతీయ స్థాయి సంస్థలు 6 జూన్ 2025న భారత్ టాక్సీ వేదికను ఏర్పాటు చేయగా... అధికారికంగా ఫిబ్రవరి 5, 2026న భారత్ టాక్సీ సేవలు ప్రారంభమయ్యాయి.

ప్రస్తుతం భారత్ టాక్సీ సేవలు ఢిల్లీ ఎన్‌సీఆర్ - ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్, గుజరాత్‌లోని అహ్మదాబాద్, రాజ్‌కోట్, సోమనాథ్, ద్వారకల్లో కొనసాగుతున్నాయి. రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా భారత్ టాక్సీ సేవలను దశలవారీగా విస్తరించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

పేటీఎం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్, ఢిల్లీ ట్రాఫిక్ పోలీస్, నేషనల్ ఇ-గవర్నెన్స్ డివిజన్, ఢిల్లీ టూరిజం -ట్రాన్స్‌పోర్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్, జీఎంఆర్ గ్రూప్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలతో భారత్ టాక్సీ అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకుంది. డిజిటల్ చెల్లింపులు, విమానాశ్రయం-మెట్రో కనెక్టివిటీ, ట్రాఫిక్, రవాణా సమన్వయం, ఇ-గవర్నెన్స్ సిస్టమ్‌లు, పర్యాటక సంబంధిత ప్రయాణ సౌకర్యాలు, బీమా కవరేజ్, మౌలిక సదుపాయాల ఏకీకరణ, సంస్థాగత బ్యాంకింగ్ మద్దతు సహా బహుళ రంగాల్లో సహకారాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా ఈ ఒప్పందాలు జరిగాయి. సమష్టిగా ఈ ఒప్పందాలు మరింత సమన్వయంతో కూడిన, పౌరులకు అనుకూలమైన రవాణా వ్యవస్థ అభివృద్ధికి దోహదపడతాయని భావిస్తున్నారు.

సహకార నమూనా ద్వారా జీవనోపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం లక్ష్యంగా ఈ వేదికను అభివృద్ధి చేశారు. ముఖ్యంగా డ్రైవర్-యజమానులు, నిరుద్యోగులు, యువతకు ఇది ఎంతో ప్రయోజనం కలిగిస్తుంది. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహిస్తుంది. ఈ కార్యక్రమం ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలనూ సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఇది మరింత అభివృద్ధి చెందుతున్న క్రమంలో సరుకు రవాణా, కమ్యూనిటీ భాగస్వామ్యం, సేవల పంపిణీ సహా దీని అమలులో వివిధ వాటాదారులను భాగం చేయనుంది. భాగస్వామ్యం స్థాయి, వృద్ధి వేగం ఆధారంగా జీవనోపాధి, స్వయం ఉపాధికి ఇది సరికొత్త మార్గాలను సృష్టిస్తుంది.

భారత్ టాక్సీ ప్లాట్‌ఫామ్ జీరో-కమీషన్ నమూనా ఆధారంగా పనిచేస్తుంది. డ్రైవర్లకు నేరుగా లాభాలను అందిస్తుంది. పెట్టుబడి-ఆధారిత అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌లకు దేశీయ ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.

# మహిళలపై నేరాల నిరోధం దిశగా చేపట్టిన చర్యలివే

న్యూఢిల్లీ, మార్చి 12: మహిళలు, బాలలపై నేరాల సంబంధిత నిబంధనలకు ప్రాధాన్యంతో దేశంలో తొలిసారిగా వాటిని ఒక అధ్యాయం కిందకు చేరుస్తూ 'భారతీయ న్యాయ సంహిత-2023' (బీఎన్ఎస్) అమలులోకి వచ్చింది. మహిళలపై నేరాలకు పాల్పడిన దోషులకు అంతిమంగా మరణశిక్ష వరకూ వివిధ రకాల కఠిన శిక్షలను ఈ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. ఇందులో భాగంగా 18 ఏళ్లలోపు బాలికలపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే- దోషులకు సహజ మరణం సంప్రాప్తించేదాకా యావజ్జీవ కారాగారం లేదా మరణ శిక్ష విధించవచ్చు. వివాహం, ఉద్యోగం, ప్రమోషన్ లేదా గుర్తింపు గోప్యత వంటి ప్రలోభాలతో లైంగిక సంబంధం నెరపే వారిని శిక్షించేందుకు 'బీఎన్ఎస్-2023'లో కొత్త సెక్షన్‌ను చేర్చారు. కొత్త క్రిమినల్ చట్టాలలో మహిళల రక్షణ సంబంధిత కీలక నిబంధనలను అనుబంధంలో చూడవచ్చు.

కొత్త చట్టాలలో న్యాయ ప్రక్రియ వేగం, సామర్థ్యం, పారదర్శకత గణనీయంగా మెరుగయ్యాయి. ఈ మేరకు సమన్-వారంట్ల జారీ, బట్వాడా, అమలు, ఫిర్యాదీలు-సాక్షుల విచారణ, దర్యాప్తులలో సాక్ష్యాల నమోదు సహా అప్పీలేట్ చర్యలు లేదా ఏదైనా ఇతర విచారణలను ఎలక్ట్రానిక్ విధానంలో ఎలక్ట్రానిక్ సమాచార లేదా ఆడియో-వీడియో మాధ్యమాల ద్వారా నిర్వహించవచ్చు. దీనికి సంబంధించి ఇ-సమన్స్, ఇ-సాక్ష్య, 'న్యాయ-శ్రుతి' (వీడియో కాన్ఫరెన్స్) వంటి అనువర్తనాలను కూడా ప్రభుత్వం రూపొందించింది. ఎలక్ట్రానిక్ మార్గంలో సమన్ల బట్వాడాకు 'ఇ-సమన్' వీలు కల్పిస్తుంది. అలాగే డిజిటల్ ఆధారాల చట్టబద్ధ-శాస్త్రీయ నమోదు సహా తారుమారుకు వీల్లేని విధంగా సేకరణ, సంరక్షణ ఎలక్ట్రానిక్ మార్గంలో నివేదనకు 'ఇ-సాక్ష్య' తోడ్పడుతుంది. తద్వారా ప్రామాణికతకు భరోసా లభించడమే కాకుండా జాప్యం తగ్గుతుంది. 'న్యాయ-శ్రుతి'తో నిందితులు, సాక్షులు, పోలీసు అధికారులు, ప్రాసిక్యూటర్లు, శాస్త్రీయ నిపుణులు, ఖైదీలు తదితరుల హాజరీ ప్రత్యక్ష సాదృశ (వర్చువల్) మాధ్యమం ద్వారా సులువవుతుంది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఈ అనువర్తనాల సాయంతో కొత్త క్రిమినల్ చట్టాలను అమలు చేయడం వల్ల న్యాయ ప్రక్రియ వేగం, సామర్థ్యం, పారదర్శకత మెరుగుపడతాయి. తద్వారా మరింత ప్రభావశీల, సాంకేతికాధారిత, సత్వర పౌర హిత న్యాయ ప్రదాన వ్యవస్థకు మద్దతు లభిస్తుంది.

**మహిళలు.. బాలల రక్షణ కోసం నిబంధనలు**

భారతీయ న్యాయ సంహిత-2023లో కొత్త అధ్యాయం-5 కింద మహిళలు, పిల్లలపై నేరాలకు ఇతరత్రా అన్ని నేరాలకు మించి ప్రాధాన్యం ఇచ్చారు.

అలాగే సామూహిక అత్యాచార నేరాల్లో మైనర్ బాధితుల విషయంలో వయోభేదం తొలగించారు. ఇంతకుముందు 16 ఏళ్లు, 12 ఏళ్లకన్నా తక్కువ వయసున్న బాలికలపై సామూహిక అత్యాచార నేరానికి వేర్వేరు శిక్షలను నిర్దేశించారు. ఈ నిబంధన సవరణ వల్ల ఇప్పుడు 18 ఏళ్లకన్నా తక్కువ వయస్సున్న మహిళపై సామూహిక అత్యాచార నేరానికి యావజ్జీవ కారాగారం లేదా మరణశిక్ష విధించవచ్చు.

సమన్ల స్వీకరణ సజావుగా సాగే విధంగా మహిళలను కుటుంబంలో అర్హులైన వయోజన సభ్యురాలుగా గుర్తింపు కల్పించారు. ఈ మేరకు కుటుంబంలో 'ఏ వయోజన పురుష సభ్యుడైనా' అనే పదజాలాన్ని 'వయోజన సభ్యులెవరైనా' అని మార్పు చేశారు.

బాధితురాలికి మరింత రక్షణ దిశగానే కాకుండా అత్యాచార నేరంపై దర్యాప్తులో పారదర్శకత కోసం బాధితుల వాంగ్మూలాన్ని ఆడియో-వీడియో మార్గాల ద్వారా పోలీసులు రికార్డ్ చేయాల్సి ఉంటుంది.

మహిళలపై కొన్ని నేరాల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని సాధ్యమైనంతవరకూ మహిళా మేజిస్ట్రేట్ ద్వారా, వారు అందుబాటులో లేనిపక్షంలో ఒక మహిళ సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ నమోదు చేయాల్సి ఉంటుంది. తద్వారా బాధితులకు సహాయక వాతావరణం ఏర్పరచి సున్నితంగా వ్యవహరించడంతోపాటు న్యాయానికి భరోసా ఇవ్వాలి.

అత్యాచార బాధితురాలి వైద్య నివేదికను 7 రోజుల్లోగా దర్యాప్తు అధికారికి పంపాలని వైద్య నిపుణులకు ఈ చట్టం నిర్దేశిస్తోంది.

15 ఏళ్ల లోపు, 60 ఏళ్లకు మించి (65కు లోపు) పురుషులు లేదా స్త్రీ లేదా మానసికంగా/శారీరకంగా వైకల్యంగల వ్యక్తి లేదా తీవ్ర అనారోగ్యం పీడితులైన వ్యక్తి (పురుషుడు లేదా స్త్రీ) తాము నివసించే ప్రదేశం కాని ఇతర ప్రదేశాల్లో పోలీసు విచారణకు హాజరు కానక్కర్లేదనే నిబంధన కూడా ఉంది. అలాంటి వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు హాజరు కాగల సంసిద్ధత ఉన్నపుడు అందుకు అనుమతించవచ్చు.

కొత్త చట్టాల ప్రకారం మహిళలు-బాలలపై నేరాల విషయంలో బాధితులకు అన్ని ఆస్పత్రులలో ఉచిత ప్రాథమిక లేదా వైద్య చికిత్సను అందించాల్సి ఉంటుంది. తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న బాధితుల శ్రేయస్సుతోపాటు వారు కోలుకునేందుకు ఈ నిబంధన ప్రాధాన్యమిస్తుంది. అంతేకాకుండా అత్యవసర వైద్య సంరక్షణ తక్షణ లభ్యతకు భరోసా ఇస్తుంది.

భారతీయ న్యాయ సంహిత-2023లోని సెక్షన్ 95 ప్రకారం నేరానికి పాల్పడటం, కిరాయి నేరగాళ్లను నియమించడం లేదా భాగస్వాములను చేయడం శిక్షార్హ నేరం. దీనికి పదేళ్ల దాకా పొడిగించే వెసులుబాటుతో కనీసం 7 సంవత్సరాల జైలు శిక్ష విధించవచ్చు. నేరం చేయించేందుకు బాలలను పురిగొల్పడం లేదా కిరాయికి నియమించడం వంటి చర్యలకు పాల్పడకుండా నేర ముఠాలు లేదా బృందాలను నిరోధించడం ఈ నిబంధన లక్ష్యం.

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయమంత్రి శ్రీ బండి సంజయ్ ఇవాళ లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ సమాచారం వెల్లడించారు.

# మత్స్య పరిశ్రమకు శీతలీకరణ ప్లాంట్లు

న్యూఢిల్లీ, మార్చి 12: భారత ప్రభుత్వ మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖలోని మత్స్య విభాగం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ద్వారా యూ.టీ. లక్షద్వీప్ ప్రతిపాదనను ఆమోదించింది. నాలుగు శీతలీకరణ కేంద్రాల యూనిట్లతో పాటు మత్స్య సంబంధిత కార్యకలాపాలకు మొత్తం వ్యయం రూ.62.43 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.44.20 కోట్లతో ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.

చెట్లత్, కిల్తాన్, బిత్రా ప్రాంతాల్లో కంటైనర్ శీతలీకరణ ప్లాంట్ల ఏర్పాటునకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని యూ.టీ. పరిపాలనా విభాగం తెలిపింది. బిత్రాలో ఇప్పటికే రోజుకు 5 టన్నుల సామర్థ్యం గల ఐస్ ప్లాంట్ విభాగం అందుబాటులో ఉంది. అదనంగా పీఎంఎంఎస్‌వై ద్వారా చెట్లత్, కిల్తాన్ ప్రాంతాలకు రోజుకు 5 టన్నుల సామర్థ్యం గల డైరెక్ట్ ఎక్స్‌పాన్షన్ (డీఎక్స్) విభాగ ఐస్ ప్లాంట్లు మంజూరయ్యాయి. వీటిలో ఒక్కో ప్లాంట్‌కు రూ.68.44 లక్షల చొప్పున నిధులు కేటాయించటమే కాక, కొనుగోలు ప్రక్రియకు టెండర్లు జారీ అయ్యాయి. వీటికి కావాల్సిన విద్యుత్ సరఫరాను కేంద్రపాలిత ప్రాంతంలోని డీజిల్ జనరేషన్ వ్యవస్థ ద్వారా అందిస్తున్నారు. సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులను అనుసంధానించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

చేపల నిల్వ, మత్స్యకారుల జీవనోపాధిపై శీతలీకరణ కేంద్రాల ప్రభావానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక అధ్యయనం చేపట్టలేదు. కానీ పీఎంఎంఎస్‌వై ద్వారా చేపట్టిన విస్తృత రంగాల అభివృద్ధి సానుకూల ఫలితాలను సూచిస్తుంది. 1960ల్లో లక్షద్వీప్‌లో చేపల ఉత్పత్తి సుమారు 500 టన్నులుండగా, ఇటీవల ఏడాదికి దాదాపు 20,000 టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. చేపల నిల్వ, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాల్లో మెరుగుదల వల్ల ఉత్పత్తుల నాణ్యత పెరిగింది. ఇది మత్స్యకార వర్గాలకు అధిక ఆదాయాన్ని, ఉపాధి అవకాశాలను కల్పించటంలో సహాయపడింది. ఇవాళ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ ఈ సమాచారాన్ని అందించారు.

# జనగామలో విజ్ మనీ నూతన శాఖ ప్రారంభం

## -విద్యార్థులకు బుక్స్ బ్యాగులు పంపిణీ
## -జోనల్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి

జనగామ, మార్చి 12: జనగామ పట్టణంలో విజ్ మనీ సంస్థ నూతన శాఖను గురువారం జోమి ల్యాక్ జేవియర్ చీఫ్



ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, జోనల్ హెడ్ శ్రీ నివాస్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ హెడ్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో మొత్తం 336 బ్రాంచ్ లు నడున్తుండగా తెలంగాణలో 35 బ్రాంచులతో పాటు జనగామలో నూతన శాఖ ప్రారంభించామని ఆయన తెలిపారు.

జనగామ, పరిసర ప్రాంత ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాల ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ శాఖ ప్రారంభం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కస్టమర్ సంతృప్తి, పారదర్శకత మరియు వేగవంతమైన సేవలే విజ్ మనీ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఈ శాఖ ద్వారా విదేశీ కరెన్సీ మార్పిడి, విదేశాలకు డబ్బు పంపే సౌకర్యం, ఫారెక్స్ ట్రావెల్ కార్డ్ సేవలు, విమాన టికెట్ బుకింగ్, హాలిడే ప్యాకేజీలు, తక్కువ వడ్డీ రేటుతో గోల్డ్ లోన్లు వంటి సేవలు అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా, సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ ఆర్) కార్యక్రమాలలో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోందని ఈ సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. అదనంగా విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. సమాజ అభివృద్ధికి విజ్ మనీ కట్టుబడి ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్ శ్రీ రాజేంద్రప్రసాద్ ఆంధ్ర తెలంగాణ ఐఏటిఏ హెడ్ శ్రీ రవి , బ్రాంచ్ మేనేజర్ వందిర్ల సురేష్, సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

# విద్య మాత్రమే భవిష్యత్తుకు పునాది..



భూపాలపల్లి మార్చి 12: భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 9 వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాభ్యాసాన్ని పూర్తి చేసు కుని సంవత్సరనీ అంతా పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ఆత్మీయంగా జరిగింది.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒంటేరు చంద్రశేఖర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్య మాత్రమే భవిష్యత్తుకు బలమైన పునాది అని, పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని మంచి ఫలితాలుసాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు. గిరిధర కృష్ణ, రాజేందర్, చక్రధర్ రావు, తంగల్ల పల్లి కుమారస్వామి, శ్రీధర్, కోటిలింగం, మహేందర్, శిరీష, శ్రీనివాస్, కల్పనా కుమారీ, మాధవి, ప్రతాప్, రమాదేవి, విద్యార్థులు పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 9వ తరగతి విద్యార్థులు తమ సీనియర్లకు మధుర జ్ఞాపకంగా వీడ్కోలు పార్టీని ఏర్పాటు చేశారు.

# టెన్త్ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్స్ పంపిణీ




నల్గొండ, మార్చి 12:నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు ఆర్జే జ్యోతిష్యరెడ్డి ఆదేశాల మేరకు హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో గురువారం టేకుమట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టెన్త్ క్లాస్ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఉపాధ్యక్షుడు సంపత్ రావు పాల్గొని విద్యార్థులకు వాటిని అందజేశారు.

ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడుతూ.. టేకుమట్ల మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే టెన్త్ క్లాస్‌లో మండల టాపర్‌కు రూ.2,500, పాఠశాల స్థాయి టాపర్‌కు రూ.1,000 బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలు సాధించాలని, కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సుధాకర్, శనిగరపు భద్రయ్య, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు తిరి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి దూడం రాజేందర్, సోషల్ జస్టిస్ మియాపురం హరీష్ కుమార్, ఎడ్యుకేషనల్ వింగ్ ఫిరోజ్ ఖాన్, ఆర్గనైజర్ సెక్రటరీ జల్లారపు ప్రసాద్ తదితరులు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాఠశాలలు, కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్ ఏర్పాటునకు సంబంధించి కార్యాచరణను స్పష్టం చేసిన పోస్ట్ బడ్జెట్ వెబినార్

న్యూఢిల్లీ, మార్చి 12: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మార్చి 9, 2026న "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ - ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటం: విద్య, నైపుణ్యాలు, విశ్వవిద్యాలయ టౌన్‌షిప్స్" పేరుతో నిర్వహించిన పోస్ట్ బడ్జెట్ వెబినార్ లో భాగంగా "పాఠశాలలు, కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్" అంశంపై ప్రత్యేక చర్చ జరిగింది. కేంద్ర బడ్జెట్ 2026-27లో ప్రకటించిన విధంగా 15,000 సెకండరీ పాఠశాలలు, 500 ఉన్నత విద్యా సంస్థల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్ (సీసీఎల్‌ల) ఏర్పాటునకు సంబంధించిన అమలు ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు. ఆవిష్కరణల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మార్చే క్రమంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ వెబినార్ సిరీస్‌లో చెప్పారు. విద్యా సంస్థలు పరిశ్రమలతో సహకారాన్ని బలోపేతం చేసుకుని, పరిశోధనలతో కూడిన విద్యను ప్రోత్సహించాలని ఆయన తెలిపారు. దీని ద్వారా క్యాంపస్లు ఆవిష్కరణలకు, పరిశ్రమల భాగస్వామ్యానికి కేంద్రాలుగా మారతాయని, విద్యార్థులకు వాస్తవ ప్రపంచంపై అవగాహన కలుగుతుందని, దేశవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి మరింత బలోపేతం అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల తరహాలోనే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ సౌకర్యాలతో అత్యాధునిక మోడల్ లాబొరేటరీలు ఇందులో ఉన్నాయని చెప్పారు. సృజనాత్మకత, మీడియా, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విభాగాల్లో యువతకు ఉన్నత ప్రమాణాలతో విద్యను, వృత్తిపరమైన శిక్షణను ఈ సంస్థ అందిస్తుందని చెప్పారు. క్రియేటివ్ కార్నర్‌ను దూరదర్శన్ ప్రారంభించినందని శ్రీ వైష్ణవ్ తెలిపారు. కంటెంట్ క్రియేటర్ల ప్రతిభను చాటుకోవటానికి, ఆదాయాన్ని పొందేందుకు, దేశవ్యాప్తంగానే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను చేరుకోవటానికి ఇది గొప్ప అవకాశాన్నిస్తుందని చెప్పారు.

ఈ సదస్సులో కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు కీలక ప్రసంగం చేశారు. సృజనాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించటానికి బలమైన వ్యవస్థను నిర్మించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. తద్వారా ఏవీజీసీ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయిలో భారత్‌ను నిలబెట్టవచ్చని పేర్కొన్నారు.

విస్లింగ్ వుడ్స్ ఇంటర్నేషనల్ వీపీ, సీటీఓ శ్రీ చైతన్య చిన్చిలికర్ నేతృత్వంలో జరిగిన బ్రేక్ అవుట్ సెషన్‌లో విధాన నిర్ణేతలు, పరిశ్రమల అధిపతులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందుతున్న క్రియేటర్ ఎకానమీకి పాఠ్యప్రణాళిక రూపకల్పన, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలతో సమన్వయం, నైపుణ్యాభివృద్ధి మార్గాలపై చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, క్రియేటివ్ టెక్నాలజీ రంగానికి చెందిన ప్రతినిధులు చర్చా బృంద సభ్యులుగా పాల్గొన్నారు. వారిలో శ్రీమతి ఎ. శ్రీజ (ఎకనామిక్ అడ్వైజర్, పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం), డాక్టర్ ఆశిష్ కులకర్ణి (ఛైర్మన్, ఫిక్కీ ఏవీజీసీ ఫోరమ్), శ్రీ రాజన్ నవాని (ఫౌండర్, గ్రూప్ అఖా, జెట్‌సింథసిస్), శ్రీమతి సోనం భగత్ (సీఈఓ, వైగర్), డాక్టర్ విశ్వాస్ దేవ్స్కర్ (సీఈఓ, ఐఐసీటీ), శ్రీ ముంజాల్ ష్రాఫ్ (డైరెక్టర్, సీఓఓ, గ్రాఫిటీ స్టూడియోస్), శ్రీ బీరెన్ ఘోష్ (ఫౌండర్, సీఈఓ, ఆస్ట్రా స్టూడియోస్), శ్రీ మాన్వేంద్ర శుకుల్ (సీఈఓ, లక్ష్య డిజిటల్), శ్రీమతి మాలా శర్మ (గ్లోబల్ వీపీ, ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్నేషనల్, అడోబ్), శ్రీమతి ప్రీతి వ్యాస్ (ప్రెసిడెంట్, మిథిక్)తో పాటు విద్యార్థులు, వాలంటీర్లు ఉన్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్ ఏర్పాటుతో విద్యార్థులకు యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్, డిజిటల్ స్టోరీ టెల్లింగ్ వంటి రంగాల్లో స్థిరమైన ఉపాధి మార్గాలు లభిస్తాయని ప్రతినిధులు స్పష్టం చేశారు. ఇది విభిన్న విద్యా విభాగాల బోధన, సృజనాత్మకత, డిజైన్ థింకింగ్‌కు ప్రాధాన్యతనిచ్చే జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు అవసరమైన మెంటార్‌షిప్, ఇంటర్న్‌షిప్స్, వాస్తవ ప్రపంచ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు పరిశ్రమలతో బలమైన భాగస్వామ్యాలు ఉండటం అత్యంత ముఖ్యమని భాగస్వామ్య ప్రతినిధులు పేర్కొన్నారు.

మొదట ఈ పథకాన్ని ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి, అక్కడి సంసిద్ధత, అభిప్రాయాల ఆధారంగా విస్తరించాలని, టైర్-2, టైర్-3 నగరాల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయాలని చర్చలో నిర్ణయించారు. ల్యాబ్స్ ఏర్పాటునకు తగిన విద్యాసంస్థలను గుర్తించటం, క్రమబద్ధమైన ఏవీజీసీ పాఠ్యాంశాలను రూపొందించటం, పరిశ్రమల సహకారంతో శిక్షణ ఇచ్చి, అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించటం, ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయటం, పరిశ్రమ-విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయటం వంటివి ముఖ్యమైన కార్యాచరణ అంశాలు.

# పరిశోధనా పద్ధతులు-నివేదిక తయారీపై విద్యార్థినులకు అవగాహన

నల్గొండ, మార్చి 12: నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ( అటానమస్) లో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో (పరిశోధన పద్ధతులు నివేదిక తయారు చేయుట) అనే అంశంపై గురువారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మంజుల అధ్యక్షత వహించగా ప్రభుత్వ కళాశాల కూకట్‌పల్లి కామర్స్ ప్రొఫెసర్ శ్రీనివాస్ రావు రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని పరిశోధన, రిపోర్ట్ తయారు చేసే విధానాన్ని వివరించారు. ప్రతి ఒక్కరు పరిశోధన పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

కామర్స్ విభాగం అధిపతి డా.సాలయ్య మాట్లాడుతూ.. కామర్స్‌లో ఉన్న అవకాశాలను వాటిని సాధించుకునే తీరును వివరించారు. కళాశాల గ్రంథాలయ శాఖ అధ్యక్షుడు డా.రాజారామ్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సౌకర్యాలు వినియోగించుకుని విద్యార్థినులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పరిశోధన పట్ల ఉన్న తమకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఔఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.అమరావతి, డా.రాజు, డా.శైలజ, నగేశ్, సారిక, శ్వేత పాల్గొన్నారు.

# మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో సోమ శివాన్షిక ప్రతిభ




నల్గొండ, మార్చి 12:ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ వారు ఇటీవల హైదరాబాద్‌లో సెకండ్ లెవెల్‌లో నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో దామరచర్ల మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థిని సోమ శివాన్సిక తండ్రి భిక్షం రెడ్డి జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఇందుకుగాను నిన్న హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో ఐబిఆర్ ఫౌండర్ రామకృష్ణ, మిస్ ఇండియన్ సుహాసిని, చైల్డ్ సైకాలజిస్ట్ సిరి పూజ, నేషనల్ రైఫిల్స్ షూటర్ డాక్టర్ భువనేశ్వరి చేతుల మీదుగా ప్రశంస పత్రం, మెమెంటో అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యంను ఉత్తమ టీచర్ అవార్డుతో డైరెక్టర్ కంభంపాటి శ్రీనయ్యను నిర్వాహకులు సన్మానించారు. శివాన్షికను పాఠశాల డైరెక్టర్లు జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, నాదెండ్ల అయ్యన్న కంభంపాటి శ్రీనయ్య, ప్రిన్సిపాల్ స్వయంపాకల హారిత, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సునీత, షాయిని శ్రీలక్ష్మి, వనజ, అంజలి, డేవిడ్, సోనీ తేజశ్రీ, రమ్యలత, జానీ బేగం అభినందించారు.

# ఎలక్ట్రిక్ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

నీలగిరి, మార్చి 12 : నల్లగొండ బస్టాండ్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం సంభవించింది. రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఎలక్ట్రిక్ బస్సు వెనుక నుండి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన బొజ్జ దేవకమ్మ(70) తన భర్త పిచ్చిరెడ్డి కి చెవుల మిషన్ (వజీతీ ఎతిబబతినీని) కొనేందుకు గురువారం ఉదయం సమయంలో నల్లగొండకు వచ్చింది. బస్టాండ్ సమీపంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుండి వచ్చిన ఎలక్ట్రిక్ బస్సు మహిళను ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నల్లగొండ బస్టాండ్ సమీపంలో రహదారి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. దీంతో బస్టాండ్ లోపలికి, వెలుపలికి బస్సులు ఒకే మార్గం గుండా ప్రయాణిస్తున్నాయి. ఇటు ఆర్టీసీ సిబ్బంది గానీ, అటు ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ గానీ సరిగ్గా లేకపోవడంతో సుభాష్ సెంటర్ అలాగే బస్సులు లోపలికి, బయటకి వచ్చే మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది.

# 'ఈ 14, 15 తేదీల్లో సిఐటియు నల్లగొండ జిల్లా మహాసభలు'



నల్గొండ, మార్చి 12: సిఐటియు నల్లగొండ జిల్లా 13వ మహాసభలు ఈ నెల 14, 15 తేదీల్లో నల్లగొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, హమాలీ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కానుగు లింగస్వామి తెలిపారు. గురువారం కనగల్ మండల కేంద్రంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మహా సభలలో జిల్లాలోని 33 మండలాల నుండి జిల్లా వ్యాప్తంగా వివిధ యూనియన్స్ నుండి 500 మంది ప్రతినిధులు, అఖిల భారత, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. సిఐటియు కేవలం కార్మికుల హక్కులే కాకుండా, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, సామాజిక సంఘాల పోరాటాలకు సంఘీభావంగా అండగా నిలుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక హక్కు లను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు ప్రయత్నిస్తున్నదన్నారు. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా గత ఐదు సంవత్సరాలుగా దేశంలో, రాష్ట్రం లో పెద్ద ఎత్తున కార్మికుల పోరాటాల ఫలితంగా వాటిని నివారించగలుగుతున్నట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పరిశ్రమలతో పాటు 73 షెడ్యూల్డ్ పరిశ్రమలలో గత ఏడు సంవత్సరాలుగా కనీస వేతనాలు జీఓలను సవరించడం లేదన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజన కార్మికులు, వీఓఏ, ఉపాధి హామీ, ఫీల్డ్ అసిస్టెంట్లలతో పాటు అనేక రకాల పార్ట్ టైమ్, గౌరవ వేతన ఉద్యోగులకు వేతనాలు పెంచడం లేదన్నారు. భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్‌పోర్టు, కార్మికుల సంక్షేమం గాలికి వదిలేసిందన్నారు. అన్నిరకాల అసంఘటిత కార్మికుల హక్కులు కాలరాయబడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సంఘటిత అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులకు అనేక వాగ్దానాలు చేసిందని, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయినా వాగ్దానాల అమలుకు ఎలాంటి చర్యలు చేపట్ట కపోవడంతో శోచనీయమ న్నారు.

జిల్లాలో రాబోవు రోజుల్లో కార్మికుల పక్షాన మరిన్ని పోరాటాలు, ఆందోళనలు నిర్వహించేందుకు ఈ నెల 14, 15 తేదీలలో నల్లగొండ పట్టణంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలు వేదిక కానున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో కార్మికుల ఆర్థిక, సామాజిక సమస్యలపై చర్చలు జరగనున్నట్లు చెప్పారు. కార్మిక, కర్షక మైత్రి ద్వారానే పాలకుల దుష్ట విధానాలను తిప్పికొట్టగలమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కనగల్ మండల కన్వీనర్ నేలగొండ రాసి లింగయ్య, పిన్నపురెడ్డి శేఖర్ రెడ్డి, బురుకల నర్సింహా, విజయ్, మల్లికార్జున్, నాగయ్య, పాలకూరి వెంకటేశం, రామలింగయ్య పాల్గొన్నారు.

# రూ.765 కోట్లకన్నా ఎక్కువ ఖర్చుతో కీలక కారిడార్లలో ట్రాక్షన్ ఉన్నతీకరణలు, డిజిటల్ కమ్యూనికేషన్ మరమ్మత్తులకు భారతీయ రైల్వేల ఆమోదముద్ర

న్యూఢిల్లీ, మార్చి 12:భారతీయ రైల్వేలు కీలక సెక్షన్లలో నిర్వహణ కార్యకలాపాలను బలోపేతం చేయడానికీ, మార్గ సామర్థ్యాన్ని విస్తరించడానికీ, కమ్యూనికేషన్ వ్యవస్థల్ని ఆధునికీకరించడానికీ మొత్తం రూ.765 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చుతో అనేక మౌలిక సదుపాయాలు, సాంకేతిక ఉన్నతీకరణ సంబంధిత పనులను మంజూరు చేసింది.

మంజూరు చేసిన ప్రాజెక్టుల్లో రెండు అధిక రద్దీతో కూడిన సరకు రవాణా, ప్రయాణికుల కారిడార్లలో విద్యుత్తు ట్రాక్షన్ వ్యవస్థల ఉన్నతీకరణతో పాటు పశ్చిమ రైల్వేలోని వడోదరా, ముంబయి సెంట్రల్ డివిజన్లలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ భారీ విస్తరణ భాగంగా ఉన్నాయి.

దువ్వాడ-విశాఖపట్నం-విజయనగరం సెక్షన్లో విద్యుత్తు ట్రాక్షన్ వ్యవస్థ ఉన్నతీకరణ

ఈస్ట్ కోస్ట్ రైల్వేలో 106 కి.మీ. పొడవైన దువ్వాడ-విశాఖపట్నం-విజయనగరం సెక్షన్లో విద్యుత్తు ట్రాక్షన్ వ్యవస్థను ఉన్నతీకరించేందుకు రూ.318.07 కోట్లను భారతీయ రైల్వేలు మంజూరు చేసింది.

ఈ సెక్షనును ఇప్పుడున్న 125 కేవీ వ్యవస్థ నుంచి 225 కేవీ వ్యవస్థ స్థాయికి ఉన్నతీకరిస్తారు. ఇది అధిక రద్దీతో కూడిన కారిడార్లో సరకు తరలింపు సామర్థ్యంలో వృద్ధి, వేగంలో మెరుగుదలతో పాటు విశ్వసనీయత కూడా పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

రద్దీగా ఉండే హౌరా-చెన్నై మార్గంలో నెలకొన్న ఈ సెక్షను ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి విశాఖపట్నం ఓడరేవు వరకూ ఖనిజాలు, పారిశ్రామిక వస్తువుల రవాణాలో కీలక పాత్రను పోషిస్తోంది. ఈ ఉన్నతీకరణతో విద్యుత్తు సరఫరా సామర్థ్యం బలోపేతం అవుతుంది. సరకు రాక, పోకలు సరళతరం అవుతాయి. ప్రయాణికుల రైళ్ల నిర్వహణ మరింతగా మెరుగుపడుతుంది.

ఈ ప్రాజెక్టు 2024-25 రైల్వే బడ్జెట్‌లో పేర్కొన్న జాతీయ స్థాయి కార్యక్రమాల్లో ఒకటి. భారతీయ రైల్వేల్లో విద్యుత్తు ట్రాక్షన్ వ్యవస్థను ఆధునికీకరించాలనేదే దీని లక్ష్యం.

రాయ్‌చూర్-గుంతకల్ సెక్షన్లో విద్యుత్తు ట్రాక్షన్ వ్యవస్థ ఉన్నతీకరణ

దక్షిణ మధ్య రైల్వేలోని గుంతకల్ డివిజన్లో భాగంగా ఉంటూ కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో విస్తరించిన 126 కి.మీ. పొడవైన రాయ్‌చూర్-గుంతకల్ సెక్షన్లో విద్యుత్తు ట్రాక్షన్ వ్యవస్థను ఉన్నతీకరించడానికి భారతీయ రైల్వేలు రూ.259.39 కోట్లు మంజూరు చేసింది.ఈ సెక్షనును ఇప్పుడున్న 125 కేవీ వ్యవస్థ స్థాయి నుంచి 225 కేవీ వ్యవస్థగా ఉన్నతీకరిస్తారు. అధిక రద్దీ కలిగిన ఈ కారిడార్లో రైళ్లు దీంతో ఇక ఎక్కువ లోడును మోసుకు పోగలుగుతాయి. ఆ రైళ్ల వేగమూ పెరుగుతుంది. నిర్వహణలో విశ్వసనీయత కూడా మెరుగువ డుతుంది.బిజీగా ఉండే ముంబయి-చెన్నై మార్గంలో పురోగమనంలో ఉన్న ఉన్నతీకరణ పనులు విద్యుత్తు సరఫరా సామర్థ్యాన్ని బలపరుస్తాయి. ఈ పనులు పూర్తి అయిన తరువాత సరకు తరలింపు సాఫీగా సాగుతుంది, వందే భారత్ రైళ్లు సహా మరింత వేగంగా పయనించే ప్రయాణికుల రైళ్ల సేవలు అందుబాటులోకి రాగలవు. ఈ ప్రాజెక్టు 3,000 ఎంటీ సరకు తరలింపును లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ రైల్వేలు ఆ లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి నెట్‌వర్క్ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది.

ఈ పని 2024-25 రైల్వే బడ్జెట్‌లో పేర్కొన్న దేశవ్యాప్త కార్యక్రమంలో ఓ భాగం. భారతీయ రైల్వేల్లో విద్యుత్తు ట్రాక్షన్ వ్యవస్థను ఆధునికీకరించడం దీని లక్ష్యం.వడోదరా, ముంబయి డివిజన్లలో అందుబా టులోకి కీలక ఓఎఫ్‌సీ కమ్యూనికేషన్ వ్యవస్థపశ్చిమ రైల్వేలోని వడోదరా, ముంబయి సెంట్రల్ డివిజన్లలో కమ్యూనికేషనును పటిష్ఠపరిచే ఉద్దేశంతో రూ.187.88 కోట్లను భారతీయ రైల్వేలు మంజూరు చేసింది.

ఈ ప్రాజెక్టులో భాగంగా 448 కోర్ ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల (ఓఎఫ్‌సీ) వ్యవస్థను నెలకొల్పుతారు. దీంతో ఎల్‌టీఈ- ఆధారిత 'కవచ్', తదితర కీలక రైల్వే కమ్యూనికేషన్ వ్యవస్థలకు అధిక బ్యాండ్‌విడ్త్ సామర్థ్యం, నెట్‌వర్క్ రిడండెన్సీతో పాటు విశ్వసనీయ రక్షణ లభిస్తుంది. దేశంలో రైళ్లు ఒకదానితో మరొకటి ఢీకొనకుండా చూసే 'కవచ్' వ్యవస్థను పనిచేయించడానికి అవసరమైన డిజిటల్ మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ ఉన్నతీకరణలో ప్రాధాన్యాన్ని ఇస్తారు.

ఈ పనిలో భాగంగా, ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లను 1,000 కిలోమీటర్ల మేర సమకూరుస్తారు. దీనిలో వడోదరా డివిజన్ పరిధిలో 692 కి.మీ., ముంబయి డివిజన్లో 308 కి.మీ. కలిసుంటాయి.

ఈ ప్రాజెక్టు 2024-25 రైల్వే బడ్జెట్‌లో పేర్కొన్న భారీ దేశవ్యాప్త కార్యక్రమంలో ఓ భాగం. 'కవచ్'ను విస్తరించడంతో పాటు, నెట్‌వర్క్ అంతటా రైల్వే కమ్యూనికేషన్ వ్యవస్థల్ని ఆధునికీకరించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

**రైల్వే మౌలిక సదుపాయాలతో పాటు సామర్థ్యం పటిష్ఠీకరణ**

మంజూరు చేసిన ఈ పనులు ట్రాక్షన్ వ్యవస్థలను మెరుగుపరిచి, కమ్యూనికేషన్లను పటిష్ఠపరచడంతో పాటు ప్రధాన రైల్వే కారిడార్లలో సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచుతాయి. ఫలితంగా రైల్వే కార్యకలాపాల సామర్థ్యం, విశ్వసనీయత ఇప్పటితో పోలిస్తే చెప్పుకోదగినంతగా వృద్ధి చెందుతుంది.ఈ కార్యక్రమాలు ఆధునిక రైళ్ల నిర్వహణకు తోడ్పడడంతో పాటు, డిజిటల్ కమ్యూనికేషన్ నెట్‌వర్కుల్ని బలపరుస్తాయి. కీలక సరకు రవాణా, ప్రయాణికుల మార్గాల్లో భారతీయ రైల్వేల వనితీరును సమగ్రంగా మెరుగుపరుస్తాయి.

# ప్రజల అండదండలతో నియోజకవర్గం అభివృద్ధి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హైదరాబాద్, మార్చి 12: ప్రజల సహకారంతో అంబర్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెలుతున్నట్లు, పెండింగ్ పనులు పరిష్కరించి, ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాకల డివిజన్‌లోని అడ్డీ ఖర్కానా ప్రాంతంలో గురువారం రూ.7 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలేరు ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లోని పలు బస్తీలలో ఎమ్మెల్యే పర్యటించి బస్తీలో నెలకొన్న స్ట్రీట్‌లైట్, తదితర సమస్యలను స్థానిక ప్రజల నుంచి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంభంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ ప్రజల సహకారంతో నియోజకవర్గంలోని అన్ని బస్తీ, కాలనీలను అభివృద్ధి చేస్తున్నట్లు, ప్రజల కనీస అవసరాలైన మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తేలేదని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సౌకర్యార్థం కోసం నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజలు పర్యవేక్షించినప్పుడే నాణ్యమైన అభివృద్ధి పనులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్,డివిజన్ మాజీ అధ్యక్షుడు భరత్‌ముదిరాజ్,ఆర్‌కె బాబు,కాలేరు రామకృష్ణ, రెడపాక రాము, సురేశ్‌గౌడ్, శేషు పేరి,కాలేరు రాజు,లక్ష్మిముదిరాజ్,మహ్మద్ మోబిన్, బాల్‌రాజు, అప్పు శ్రీను, యూనుష్ శరీఫ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రసార భారతికి చెందిన పీబీ - శబ్ద్ ద్వారా మార్చి 2027 వరకు ఉచితంగా లోగో లేని వార్తలు లభ్యం

న్యూఢిల్లీ, మార్చి 12 :మార్చి, 2024లో ప్రారంభమైన ప్రసార భారతి-షేర్డ్ ఆడియో-విజువల్స్ ఫర్ బ్రాడ్‌కాస్ట్ అండ్ డిస్సెమినేషన్ (పీబీ - శబ్ద్) మీడియా సంస్థలకు వీడియో, ఆడియో, టెక్స్ట్, ఫోటోల రూపంలో లోగో లేకుండా రోజువారీ వార్తలను ఉచితంగా అందిస్తోంది. శబ్ద్ ద్వారా ఉచిత సేవలు మార్చి 2027 వరకు కొనసాగుతాయని ప్రసార భారతి ప్రకటించింది.

1500 మందికి పైగా రిపోర్టర్లు, కరస్పాండెంట్లు, స్ట్రింగర్ల తో కూడిన పటిష్టమైన నెట్‌వర్క్, 24 గంటలూ పనిచేసే 60 ప్రత్యేక ఎడిట్ డెస్కుల ద్వారా పీబీ-శబ్ద్ భారతదేశం నలుమూలల నుంచి తాజా వార్తలను అందిస్తోంది. ప్రాంతీయ వార్తా విభాగాల నుంచి , ప్రధాన కార్యాలయం నుంచి వ్యవసాయం, సాంకేతికత, విదేశీ వ్యవహారాలు, రాజకీయ పరిణామాలు వంటి వివిధ విభాగాల్లో ప్రతిరోజూ మొత్తం 1000 వార్తా ప్రసారాలు అన్ని ప్రధాన భారతీయ భాషల్లో అప్‌లోడ్ అవుతాయి. పీబీ-శబ్ద్ ద్వారా లభించే వార్తలు లోగో లేకుండా ఉంటాయి. ఈ ప్లాట్‌ఫా మ్ నుంచి వార్తలను ఉపయోగి ంచుకోవడానికి ఎటువంటి క్రెడిట్ ఇవ్వాల్సిన అవసరం లేదు.

పీబీ-శబ్ద్ లైవ్ ఫీడ్ సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. జాతీయ ప్రాముఖ్యత ఉన్న కార్యక్రమాలు, పురస్కార ప్రదానోత్సవాలు, వివిధ పత్రికా సమావేశాలను లోగో లేకుండా ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. సమాచారాన్ని మరింత సులభంగా పొందేందుకు ఒక మీడియా సమాచార భాండాగారం కూడా అందుబాటులో ఉంది. దీని ద్వారా చందాదారులు పాత ఫుటేజీని, ప్రత్యేకంగా సిద్ధం చేసిన ప్యాకేజీలను సులభంగా పొందవచ్చు. ప్రత్యేక ప్యాకేజీలు, ఇంటర్వ్యూలు, భారతదేశం అంతటా రోజువారీ వాతావరణ సమాచారం, ఎడిటోరియల్ కథనాలు పీబీ-శబ్ద్ లో క్రమం తప్పకుండా అప్‌డేట్ అవుతాయి. దీనివల్ల మీడియా సంస్థలు ఈ సమాచారాన్ని వెంటనే వాడుకోవచ్చు. తద్వారా సమయం ఆదా అవుతుంది.

# జాతీయ రహదారులపై భద్రతను, భాగస్వామ్య నిర్వహణను మెరుగుపరిచేందుక అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, మార్చి 12:వాణిజ్య వాహన డ్రైవర్లకు, ఫ్లీట్ ఆపరేటర్లకు 'రవాణా సౌలభ్యాన్ని' మెరుగుపరిచే లక్ష్యంతో ఎన్‌హెచ్‌ఏఐ సహకారమందిస్తోన్న ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌ఎంసీఎల్) సంస్థ వాణిజ్య వాహన సేవల వేదికలతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. న్యూఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఏఐ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ రహదారుల్లో ప్రయాణించే వాణిజ్య వాహన డ్రైవర్లకు, ఫ్లీట్ ఆపరేటర్లకు భద్రతను, సామర్థ్యాన్ని, వినియోగదారు అనుభవాన్ని పెంపొందించేలా విభిన్న వ్యవస్థల మధ్య సమన్వయానికి, సాంకేతిక ఆధారిత పరిష్కారాలను ఉపయోగించుకొనేందుకు ఎంవోయూ వీలు కల్పిస్తుంది. ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ శ్రీ సంతోష్ కుమార్ యాదవ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐహెచ్‌ఎంసీఎల్ సీఎండీ శ్రీ విశాల్ చౌహాన్, ఎన్‌హెచ్‌ఏఐ, ఐహెచ్‌ఎంసీఎల్‌కు చెందిన ఉన్నతాధికారులు, అయిదు సేవా వేదికలు - వీల్స్‌ఐ టెక్నాలజీ ఇండియా, బ్లాక్‌బక్, ట్రక్సప్ సొల్యూషన్స్, ట్రక్‌సువిధ ? సర్వోదయ ఇన్ఫోటెక్, సాఫ్రన్ నేవిగేటర్స్ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ రహదారులపై సురక్షితమైన, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ విధానాలను పాటించిన డ్రైవర్లకు 'విశిష్ట సారథి' పురస్కారాన్ని ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ అందించారు.

# ఇరాక్ ఆయిల్ ట్యాంకర్‌పై దాడి: 15 మంది భారతీయ సిబ్బందిని రక్షించిన భారత రాయబారి కార్యాలయం

హైదరాబాద్, మార్చి 12:మార్చి 11న బస్రా తీరానికి సమీపంలో ఒక ఆయిల్ ట్యాంకర్‌పై జరిగిన దాడి తరువాత, ఇరాక్‌లోని భారత రాయబారి కార్యాలయం 15 మంది భారతీయ నౌకా సిబ్బందిని విజయవంతంగా రక్షించింది. రాయబారి కార్యాలయం తన పౌరులతో మరియు స్థానిక పరిపాలనతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, రక్షించబడిన భారతీయులను సురక్షిత ప్రాంతానికి తరలించింది.ఇరాన్, ఇజ్రాయెల్ మరియు అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా పశ్చిమ ఆసియా ప్రాంతంలో పరిస్థితి ఇంకా సున్నితంగా ఉంది. ఈ ఉద్రిక్తతల మధ్య, మార్షల్ దీవుల జెండాతో ప్రయాణిస్తున్న మరియు ఒక అమెరికా కంపెనీకి చెందినదిగా నివేదించబడిన క్రూడ్



ఆయిల్ ట్యాంకర్ "సేఫేస్ విష్ణు" ఇరాక్‌లోని బస్రా సమీపంలో దాడికి గురైంది. మీడియా నివేదికల ప్రకారం, ఈ దాడిని ఇరాన్‌కు చెందిన ఒక ఆత్మాహుతి పడవ ద్వారా నిర్వహించారు. ఈ ఘటనలో దురదృష్టవశాత్తు ఒక భారతీయ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, బాగ్దాద్‌లోని భారత రాయబారి కార్యాలయ అధికారులు ఇప్పటికే అప్రమత్తంగా ఉండి, అక్కడి పరిణామాలను దగ్గరగా గమనిస్తున్నారు.

# అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయించాలి : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి




మెదక్, మార్చి 12: అర్హులైన బాలికలకు వారి తల్లిదండ్రులు హెచ్‌పీవీ టీకాలు వేయించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్‌పీవీ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి బాలికలకు టీకాలు వేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఈ టీకాలు వేయించాలని తెలిపారు. బాలికల ఆరోగ్యం కోసం ఎంతో అవసరమైన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు వైద్య శాఖను అభినందించారు. బాలకల ఆరోగ్య రక్షణలో భాగంగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) టీకా ఎంతో ముఖ్యమైనదని వెల్లడించారు. హెచ్‌పీవీ అనే వైరస్ వల్ల గర్భాశయ సెర్వికల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ టీకా వేసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ సెర్వికల్ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ హెచ్‌పీవీ టీకా సురక్షితమైనదని, ప్రపంచ వ్యాప్తంగా వైద్య నిపుణులు సూచిస్తున్న సమర్ధవంతమైన రక్షణాత్మక టీకాలలో ఒకటని పేర్కొన్నారు.

బాలికల ఆరోగ్య భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాచునూరి లక్ష్మీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. సృజన, నర్సాపూర్ ఏరియా దావాఖాన సూపరింటెండెంట్ డా.పావని, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కొండామల్లేపల్లి హోట్సల్స్‌లో అధికారుల తనిఖీలు

## – డొమెస్టిక్ సిలిండర్లు 60 పట్టివేత



నల్గొండ, మార్చి 12: గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లు వ్యాపార అవసరాలకు వాడుతున్నారన్న సమాచారంతో నల్లగొండ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి డీఎస్ఓ వెంకటేశ్వర్లు ఆదేశాలతో సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్‌మెంట్ అలాగే టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం కొండామల్లేపల్లిలోని పలు హోటల్స్‌పై రైడ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో డొమెస్టిక్ సిలిండర్లు 60 గమనించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్రమ వినియోగంపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార అవసరాల కోసం వినియోగిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంఅ వారు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో దేవరకొండ సివిల్ సప్లయ్ అధికారి ముబీన్, డిటిసిఎస్ ఎండీ ముక్తార్, దీపక్, సైదులు గౌడ్, జ్యోతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సైదులు, కుమార్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సైదులు పాల్గొన్నారు.

# బీసీ సాధికారిత సంఘం బలోపేతంకై కమిటీల విస్తరణ

## – రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్



రాజన్న సిరిసిల్ల, మార్చి 12: నేటినిజం (ప్రతినిధి): బీసీ సాధికారిత సంఘం బలోపేతం కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో కమిటీలను విస్తరించడం వారం రోజులుగా జోరుగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా వేములవాడలోని సంఘ కార్యాలయంలో సుమారు 50 మందికి నియామక పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ సంఘాన్ని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి కమిటీల విస్తరణ అవసరం ఉన్నదని, త్వంలో గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంను నిర్వహించి పటిష్టమైన కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జ్ పొలాస నరేందర్మాట్లాడుతూ కమిటీలు బలంగా ఉంటేనే సంఘం బలపడుతుందనీ అన్నారు. బీసీ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా భారీ బీసీ మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన "మేమెంతో నాకంత వాటా కోటా" నినాదంతో ముందుకు వెళ్తామని, మా ఓట్లు మేమే వేస్తాం. మా సీట్లు మేమే దక్కించుకుంటాం అన్నారు.ఈ కార్యక్రమంలో మెంగన మనోహర్ ను రాష్ట్ర బీసీ సాధికారత సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, అలాగే రాష్ట్ర మీడియా ఇంచార్జ్‌గా నియమించి నియామక పత్రం అందజేశారు. రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ కమిటీలలో పలువురికి పదవులు ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. వారందరినీ రాజన్న కండువాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఇల్లందుల వెంకటేష్ (పట్టణ ప్రధాన కార్యదర్శి), జిల్లా బీసీ నేతలు చింతలకోటి రామస్వామి గౌడ్, చేను హేలపతి, గోగికారి రాజు, కుంభం రవి, కత్రోజు ప్రభాకర్, జాంపయ్య తదితరులు పాల్గొన్నారు.





**మొల్ల సాహిత్య కీర్తిని అమరత్వం పొందేలా చేసిన ప్రధాన రచన "మొల్ల రామాయణం". భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాముఖ్యమైన గ్రంథాలలో ఒకటైన వాల్మీకి మహర్షి రచించిన రామాయణం అనేక భాషల్లో అనువాదమైంది.**



(మార్చి 13న మొల్ల జయంతి సందర్భంగా..)

**మొల్ల వ్యక్తిత్వంలో కనిపించే మరో విశిష్ట లక్షణం ఆమె ఆత్మగౌరవం. ఆమె తన కావ్యాన్ని ఏ రాజుకూ అంకితం ఇవ్వలేదు. రాజుల ప్రశంసలు పొందడం కోసం కవిత్వం రాయలేదని స్పష్టంగా తెలిపింది. తన రచనను కేవలం శ్రీరామచంద్రుడికే అంకితం చేస్తానని ఆమె ప్రకటించింది.**

# తెలుగు సాహిత్య చరిత్రలో వెలుగొందిన తొలి కవయిత్రి మొల్ల

తెలుగు సాహిత్య చరిత్రలో స్త్రీ రచయితల ప్రస్థానం గురించి మాట్లాడినప్పుడు మొదట గుర్తుకు వచ్చే మహోన్నత వ్యక్తిత్వం ఆతుకూరి మొల్ల, అంటే మొల్లమాంబ. సాహిత్య చరిత్రలో ఆమెను "తెలుగు ఆది కవయిత్రి"గా గౌరవంగా స్మరిస్తారు. పురుషాధిక్య సమాజంలో సాహిత్య రంగం దాదాపు పూర్తిగా పురుషుల ఆధీనంలో ఉన్న కాలంలో ఒక మహిళ కవయిత్రిగా ఎదిగి తన సాహిత్య ప్రతిభతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తిత్వం మొల్లది. సంస్కృత మహా కావ్యమైన రామాయణాన్ని అత్యంత సరళమైన తెలుగులో ప్రజలకు అందించిన కవయిత్రిగా ఆమెకు తెలుగు సాహిత్య చరిత్రలో అపూర్వమైన స్థానం దక్కింది. ప్రజల భాషలో, ప్రజల హృదయాలకు చేరువగా మహాకావ్యాన్ని చెప్పిన సాహిత్య స్రష్టగా ఆమె పేరు శాశ్వతంగా నిలిచిపోయింది.

ప్రతి సంవత్సరం మార్చి 13న మొల్ల జయంతిని జరుపుకుంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆమెకు ప్రత్యేక గౌరవాన్ని ప్రకటించింది. ఇది కేవలం ఒక కవయిత్రికి ఇచ్చిన గౌరవమే కాదు; తెలుగు భాషా సాహిత్య సంపదకు సమాజం ఇచ్చిన గౌరవంగా కూడా భావించవచ్చు. ముఖ్యంగా మహిళా సాహిత్య సంప్రదాయాన్ని గుర్తు చేసే సందర్భంగా మొల్ల జయంతి ప్రత్యేక ప్రాధాన్యం పొందింది.

మొల్ల జీవిత విశేషాలను పరిశీలించి నప్పుడు ఆమె వ్యక్తిత్వం లోని విశిష్టత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. పరిశోధకుల అభిప్రాయాల ప్రకారం మొల్ల 15వ శతాబ్దం చివరలో లేదా 16వ శతాబ్దం ప్రారంభంలో మార్చి 13న జన్మించి ,జీవించినట్లు భావిస్తారు. ఆమె జన్మస్థలం ఆంధ్ర ప్రదేశ్‌లోని గోపవరం గ్రామం. ఈ ప్రాంతం అప్పట్లో నెల్లూరు ప్రాంతానికి చెందినదిగా చెప్పబడినప్పటికీ ఆధునిక పరిపాలనా విభజనల ప్రకారం కడప జిల్లాలో భాగంగా పేర్కొన బడుతోంది. ఆమె తండ్రి పేరు కేశవ. వృత్తిరీత్యా కుండలు తయారు చేసే కుటుంబంలో మొల్ల జన్మించినట్లు సాహిత్య పరిశోధకులు పేర్కొంటారు. అందువల్ల మొల్లను సామాన్య ప్రజల మధ్య పెరిగిన ప్రజా కవయిత్రిగా కూడా పరిగణిస్తారు.

సామాజికంగా ఉన్నత వర్గానికి చెందిన కుటుంబంలో జన్మించక పోయినా భక్తి భావన, జ్ఞానాభిలాష, సాహిత్యాసక్తి వంటి విలువలతో కూడిన వాతావరణంలో ఆమె పెరిగింది. చిన్ననాటి నుంచే భాషపై ఆసక్తి పెంచుకున్న మొల్ల తన సహజ ప్రతిభతో సాహిత్య ప్రపంచంలో ప్రవేశించింది. సంప్రదాయ విద్యావకాశాలు పరిమితంగా ఉన్నప్పటికీ భాషపై ఉన్న సహజ పట్టు, ఆధ్యాత్మిక భావజాలం, సృజనాత్మకత ఆమెను ఒక గొప్ప కవయిత్రిగా తీర్చిదిద్దాయి.

మొల్ల జీవించిన కాలాన్ని అర్థం చేసుకుంటే ఆమె ప్రతిభ మరింత గొప్పదిగా అనిపిస్తుంది. ఆ కాలంలో స్త్రీలకు విద్యా అవకాశాలు చాలా పరిమితంగా ఉండేవి. ముఖ్యంగా సాహి త్య రంగం పండితుల ఆధీనంలో ఉండేది. సం స్కృత పాండిత్యం ఉన్న వారే కావ్యరచన చేయ గలరనే భావన బలంగా ఉండేది. అలాంటి పరిస్థితుల్లో ఒక మహిళగా మొల్ల మహాకావ్యం రచిం చడం నిజంగా అసాధా రణ సంఘటన. ఆమె ధైర్యం, ఆత్మవిశ్వాసం, భక్తి భావం, భాషపై ఉన్న పట్టు ఆమెను తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానానికి చేర్చాయి.

మొల్ల సాహిత్య కీర్తిని అమరత్వం పొందేలా చేసిన ప్రధాన రచన "మొల్ల రామాయణం". భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాముఖ్యమైన గ్రంథాలలో ఒకటైన వాల్మీకి మహర్షి రచించిన రామాయణం అనేక భాషల్లో అనువాదమైంది. తెలుగులో కూడా అనేక మంది కవులు రామాయణాన్ని రచించారు. అయితే వాటిలో మొల్ల రామాయణానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. దీనికి ప్రధాన కారణం ఆమె ఉపయోగించిన భాషా సరళి.

మొల్ల రామాయణంలో కనిపించే ముఖ్యమైన లక్షణం భాషా సరళత. సంస్కృత పదజాలంతో నిండిన క్లిష్టమైన భాషను ఉపయోగించడం కాకుండా సాధారణ ప్రజలు మాట్లాడే భాషకు దగ్గరగా ఉండే తెలుగును మొల్ల వినియోగించింది. ఈ విధానం వల్ల గ్రామీణ ప్రజలు కూడా ఈ కావ్యాన్ని సులభంగా అర్థం చేసుకోగలిగారు. అందువల్ల మొల్ల రామాయణం పండితులకే పరిమితమై పోకుండా ప్రజల మధ్య విస్తృతంగా ప్రచారం పొందింది.

కథన విధానంలో కూడా మొల్లకు ప్రత్యేకమైన నైపుణ్యం కనిపిస్తుంది. ఆమె కథను చెప్పే తీరు సహజంగా ఉంటుంది. పాత్రల భావోద్వేగాలను సన్నితంగా వ్యక్తీకరించడం ఆమె కవిత్వంలో ప్రధాన లక్షణం. శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు వంటి పాత్రలను ఆమె ఎంతో మానవీయంగా చిత్రించింది. పాత్రల మధ్య సంభాషణలు సహజంగా ఉండటం వల్ల పాఠకుడు కథలోని భావాలకు మరింత దగ్గరగా చేరతాడు. ఈ విధంగా మొల్ల కథనం పాఠకుడి మనసును హత్తుకునేలా ఉంటుంది.

మొల్ల రామాయణంలో భక్తి భావం ప్రధానంగా ప్రతిఫలిస్తుంది. శ్రీరాముడిపై ఆమెకు ఉన్న భక్తి ప్రతి పద్యంలో ప్రతిధ్వనిస్తుంది. ధర్మం, నీతి, సత్యం, సహనం వంటి విలువలను రామాయణ కథ ద్వారా ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశ్యం ఆమె రచనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధంగా ఆమె రచన కేవలం సాహిత్య కృతి మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక, నైతిక సందేశాన్ని కూడా అందిస్తుంది.

మొల్ల కవిత్వంలో స్త్రీ సున్నితత్వం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా సీత పాత్ర చిత్రణలో ఈ లక్షణం మరింత బలంగా వ్యక్తమవుతుంది. సీత దుఃఖం, ఆమె సహనం, ఆమె విశ్వాసం వంటి భావాలను మొల్ల ఎంతో హృదయానికి హత్తుకునే విధంగా వ్యక్తీకరించింది. స్త్రీ దృష్టికోణం నుంచి రామాయణ కథను చెప్పిన విధానం మొల్ల రామాయణానికి ప్రత్యేకమైన సాహిత్య విలువను కలిగించింది.

మొల్ల తన రామాయణానికి రాసిన పీఠికలో కవిత్వ స్వభావం గురించి గొప్ప భావనను వ్యక్తం చేసింది. "చెప్పిన చోటనే చెప్పక విన్నవారికి విందువుగా ఉండాలి" అనే భావాన్ని ఆమె వెల్లడించింది. అంటే కవిత్వం పండితులకు మాత్రమే కాదు; విన్నవారికి ఆనందాన్ని పంచేలా ఉండాలని ఆమె భావించింది. కవిత్వం ప్రజలకు హృదయానందాన్ని కలిగించే సాధనమని ఆమె స్పష్టం చేసింది.

ఇంకా ఆమె మరో చోట "తేనె సోక నోరు తీయనగు రీతి" అని పేర్కొంది. తేనె తగిలితే నోరు ఎలా తీపిగా మారుతుందో, అలాగే తన కవిత్వం వినేవారికి మధురానుభూతిని కలిగించాలని ఆమె ఆకాంక్షించింది. సరళత, మాధుర్యం, సహజత్వం ఇవే ఆమె కవిత్వానికి ప్రధాన లక్షణాలు.

మొల్ల వ్యక్తిత్వంలో కనిపించే మరో విశిష్ట లక్షణం ఆమె ఆత్మగౌరవం. ఆమె తన కావ్యాన్ని ఏ రాజుకూ అంకితం ఇవ్వలేదు. రాజుల ప్రశంసలు పొందడం కోసం కవిత్వం రాయలేదని స్పష్టంగా తెలిపింది. తన రచనను కేవలం శ్రీరామచంద్రుడికే అంకితం చేస్తానని ఆమె ప్రకటించింది. "రాజ పూజితం కాకపోయినా రామ పూజితం కావడమే నా సాహిత్యానికి సార్థకత" అనే భావన ఆమె ఆధ్యాత్మికతను మరియు స్వాభిమానాన్ని ప్రతిబింబిస్తుంది.

తెలుగు సాహిత్య చరిత్రలో మొల్ల స్థానం అత్యంత గౌరవ ప్రదమైనది. ఆమెను కేవలం తొలి కవయిత్రిగా మాత్రమే కాకుండా ప్రజల కవయిత్రిగా కూడా సాహిత్య చరిత్ర స్మరిస్తుంది. స్త్రీలకు అవకాశాలు తక్కువగా ఉన్న కాలంలో ఆమె సాధించిన విజయాలు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ద్వారా తెలుగు సాహిత్య సంపదకు గౌరవం ప్రకటించింది. సామాజిక పరిమితులను అధిగమించి పట్టుదలతో సాహితీ శిఖరాలను అధిరోహించిన మొల్ల జీవితం నేటి తరం మహిళలకు గొప్ప స్ఫూర్తి.

తెలుగు భాష ఉన్నంత వరకు ఆది కవయిత్రి మొల్లమ్మ పేరు చిరస్థాయిగా వెలుగుతూనే ఉంటుంది. ఆమె కవిత్వ మాధుర్యం తేనెలా తీయగా తెలుగు హృదయాల్లో యుగయుగాల పాటు మార్మోగుతూనే ఉంటుంది.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

## - కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ చేతుల మీదుగా బ్రోచర్ ఆవిష్కరణ



కరీంనగర్, మార్చి 12: (నేటినిజం ప్రతినిధి) ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి, ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ 2026 ఈ నెల మార్చి, 15వ తేది ఆదివారము స్థానిక ఆల్ఫోర్స్ ఇ- టెక్నో విద్యాసంస్థ కొత్తపల్లి, కరీంనగర్ లో నిర్వహించనున్నట్లు చీఫ్ ఆర్గనైజర్ కె .వసంత్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ చేతుల మీదుగా బ్రోచర్ విడుదల కార్యక్రమాన్ని అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగినట్లు ఒకినావా కరాటే సంస్థల ఛీఫ్ ఇన్స్ట్రక్టర్ కె. వసంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే సీనియర్ మాస్టర్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ మన్నన్ ( వేములవాడ), ఎం. లింగయ్య( జగిత్యాల్ ) కరాటే మాస్టర్లు పుల్లూరి శ్రీనివాస్, బుర్ర ప్రవీణ్ కుమార్, , రాజశేఖర్, రిషి కుమార్ ( కరీంనగర్) పాల్గొన్నట్లు టోర్నమెంట్ ఛీఫ్ ఆర్గనైజర్ కె. వసంత్ కుమార్ తెలిపారు.

# 14 న జరిగే అంజన్న ఆశీర్వాద యాత్రకు తరలిరండి.

## -ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులకు జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ పిలుపు...



కరీంనగర్, మార్చి 12: (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఈనెల 14న చేపట్టనున్న కొండగట్టు అంజన్న స్వామి ఆశీర్వాద పాదయాత్ర లో కార్మికులంతా పాల్గొనాలని ఉమ్మడి జిల్లా కార్మిక జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ కోరారు .

ఈ మేరకు గురువా రం రోజున చాడఆనంద్ మీడి యాకు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు కరీంనగర్ చైతన్యపురి సమీపంలోని మహాశక్తి ఆలయం వద్ద నుండి ఘనంగా ప్రారంభమై కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వరకు జరుగుతున్న ఈ పాదయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ పాదయాత్ర ద్వారా కార్మికుల ఐక్యత మరింత బలపడటంతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించి ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులు పాదయాత్రకు మద్దతు తెలుపుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

కరీంనగర్ పట్టణంలో ఉన్న కార్మికులు మరియు కార్మిక సంఘాల నాయకులు ఉదయం మహాశక్తి ఆలయం వద్దకు చేరుకోవాలని, అలాగే మిగతా మండలాలు, గ్రామాలలో ఉన్న కార్మిక నాయకులు పాదయాత్రకు మార్గ మధ్యంలో స్వాగతం పలుకుతూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసీ చైర్మన్ చాడా ఆనంద్ ఈ ప్రకటనలో కోరారు.

# నేడు బీ ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో దావతే ఇఫ్తార్



కరీంనగర్, మార్చి 12: (నేటినిజం ప్రతినిధి) పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేములవాడ పట్టణం చల్మెడ లక్ష్మీనరసింహారావు క్యాంప్ ఆఫీస్ లో బిఆర్ ఎస్ పార్టీ ద్వారా దావతే ఇఫ్తార్ తో పాటు భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు తెలిపారు. బీ ఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించ తలపెట్టిన దావతే ఇఫ్తార్ కార్యక్రమ సన్నాహక ఏర్పాట్లను సమీక్ష నిర్వహించారు. లక్ష్మీనరసి ంహా రావు మాట్లాడుతూ ఈ దావతే ఈ దావతే ఇఫ్తార్ లో ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు ప్రతిఒక్కరికి ఆహ్వా నం ఉందని, భోజన ఏర్పాట్లు, ఇఫ్తార్ విందు ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. వేముల వాడపట్టణ ముస్లిం సమాజం భారీ సంఖ్యలో తరలివచ్చి బీ ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దావతే ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరై పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు.

# కిడ్నీ వ్యాధులపై అవగాహన ఉండాలి : డాక్టర్ కె.ఇందిర

బన్సీలాల్‌పేట్, మార్చి 12 : మూత్రపిండాలు (కిడ్నీ)లు రక్తంలోని మలినాలను, అదనపు నీటిని తొలగించి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయని, దయాబెటిస్, బీ.పి వలన కిడ్నీ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నదని గుర్తించాలని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఇందిర అన్నారు. 'ప్రపంచ కిడ్నీ దినం' సందర్భంగా నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

# బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కొండ దేవయ్య పటేల్ జన్మదిన వేడుకలు!

## -మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య( పటేల్) జన్మదిన వేడుకలు
## -అట్టడుగు బడుగు బలహీనర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి కృషి చేస్తా
## -మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ( పటేల్ )

రాజన్న సిరిసిల్ల, మార్చి 12: నేటి నిజం (ప్రతినిధి): బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపు నిత్యాన్న సత్ర భవనంలో కొండ దేవయ్య పటేల్ రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కటింగ్ చేసి ,పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. జన్మదినం సందర్భంగా కొండ దేవయ్య కు పలువురు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బీసీ సాధికారిత సంఘం, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య మాట్లాడుతూ అట్టడుగు, బడుగు బలహీనర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని,బీసీ హక్కుల సాధనకై, బీసీల సంక్షేమానికి,బీసీల ఆత్మ గౌరవంకై బీసీల సహాకారంతో పోరాడుతామన్నారు. ప్రభుత్వాలు ఎన్నికలొస్తేనే బీసీలను గుర్తించడం కాకుండా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న బీసీ సమస్యలను వెంటది వెంట పరిష్కరించాలని ,బీసీలకు ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని,తన జన్మదినం సందర్భంగా ప్రజలకు సౌకర్యార్థం అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిం చారు. అనువారి కారణాల వలన మధ్యలో అంబులెన్స్ సేవలు నిలిచాయని,తిరిగి యధావిధిగా అంబులెన్స్ సేవలు కొనసాగునని దేవయ్య అన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో వేలాదిమంది కరాటే క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని అన్నారు. పొలాస నరేందర్ ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీ మాట్లాడుతూ కొండ దేవయ్య మున్నూరు కాపు కులం పటిష్టత కొరకు,కులం ఐక్యత కోసం గత 20 ఏండ్ల నుండి సేవచేస్తున్న వ్యక్తని అంతే కాకుండా స్వాతంత్ర్య ఫలాలు, రాజ్యాంగ ఫలాలు జనాభా దామాషన బీసీలకు అందడం లేదని బీసీలకు న్యాయం జరగాలని బీసీలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్న తపనతో, తాపత్రయంతో,లక్ష్యంతో ముందుకు వెళ్తున్న వ్యక్తి కొండ దేవయ్య పటేల్ అని అన్నారు. జన్మదిన వేడుకల కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ మన్నాన్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు బొప్ప దేవయ్య పటేల్ మున్నూరు కాపు సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి, బీసీ నేతలు కూరగాయల కొమురయ్య, కూరగాయల మల్లేశం, నామాల పోషెట్టి,కొండ కనుకయ్య,మారం కుమార్,గోపు బాలరాజు, మెంగేన మనోహర్, కొరెపు నరేష్, అయిలవేని రాజేందర్,ఇల్లందుల వెంకటేష్,చింతల కోటి రామస్వామి గౌడ్, ముద్ర కొల లింబద్రి,చేను హేలపతి, అన్నారం ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 14న ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో దావతే ఇఫ్తార్

## -ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ కరీంనగర్ రాక
## -ఆమీర్ నగర్ మధు గార్డెన్లో ఏర్పాట్లను పరిశీలించిన ఎంఐఎం నేతలు



కరీంనగర్, మార్చి 12: (నేటినిజం ప్రతినిధి) పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని కమాన్ టూ హౌసింగ్ బోర్డ్ రోడ్ లో గల మధు గార్డెన్ లో ఎంఐఎం పార్టీ ద్వారా దావతే ఇఫ్తార్ తో పాటు భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన దావతే ఇఫ్తార్ కార్యక్రమ సన్నాహక ఏర్పాట్లను, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ దారుసలాం లో సమీక్ష నిర్వహించారు. మధు గార్డెన్ చేరుకొని ఏర్పాట్లపై పరిశీలించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ దావతే ఇఫ్తార్ కార్యక్రమ ఏర్పాట్లను తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు చేస్తున్నామని వెల్లడించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ దావతే ఇఫ్తార్ లో ఉపవాస దీక్షలు పాటించే ప్రతిఒక్కరికి ఆహ్వానం ఉందని, ఉమ్మడి జిల్లాకు చెందిన, కరీంనగర్ నగరానికి సంబంధించిన ఎంఐఎం పార్టీ కార్యకర్తలు, నాయకులు అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో, సుమారు 4వేల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు, ఇఫ్తార్ విందు ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. సాయంత్రం 4:30గంటల మధు గార్డెన్ చేరుకొని మౌలాన బయాన్ ఉంటుందన్నారు. అనంతరం ఉపవాస దీక్షను విరమించి ఇఫ్తార్ చేసుకొని, ఇదే ఫంక్షన్ హాల్లో మగ్రిబ్ నమాజ్ చేసుకునేలా ఏర్పాటు చేశామని, అనంతరం భోజన ఏర్పాట్లను చేశామన్నారు. కావున కరీంనగర్ పట్టణ ముస్లిం సమాజం భారీ సంఖ్యలో తరలివచ్చి ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దావతే ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరై పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని గులాం అహ్మద్ పిలుపునిచ్చారు.

# iQOO Z11x ను విడుదల చేసిన iQOO Z




హైదరాబాద్, మార్చి 12: హై-పర్ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ iQOO భారత్‌లో iQOO Z11x ను విడుదల చేసింది. చదువు, వినోదం మరియు తమ లక్ష్యాలను సమతుల్యం చేసుకునే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ ఫోన్, సెగ్మెంట్‌లో ముందంజలో ఉన్న బ్యాటరీ, శక్తివంతమైన ప్రాసెసింగ్ సామర్థ్యాలు, సాఫీగా మల్టీటాస్కింగ్ చేయడానికి అనువైన పనితీరుతో పాటు మెరుగైన దృఢత్వాన్ని అందిస్తుంది. ఈ రోజుల్లో విద్యార్థుల వేగవంతమైన జీవనశైలికి అనుగుణంగా రూపొందించిన ఈ డివైస్, రోజంతా వారికి ఉత్పాదకత, వినోదం మరియు కనెక్టివిటీని అందిస్తుంది.

iQOO యొక్క జి-సిరీస్‌ను మరింత బలపరిచే ఈ సెగ్మెంట్‌లో అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్× అయిన iQOO Z11x, MediaTek Dimensity 7400-Turbo ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. ఇది AnTuTuలో 10 లక్షలకు పైగా స్కోర్ సాధిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో సెగ్మెంట్‌లోనే అతిపెద్ద 7200 టర్బో బ్యాటరీ ఉండి, 44డబ్ల్యు ఫ్లాష్ చార్జ్ సపోర్ట్‌తో వస్తుంది మరియు 6 సంవత్సరాల వరకు బ్యాటరీ ఆరోగ్యంను నిలబెట్టేలా రూపొందించబడింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com